

అల్లూరి జిల్లాలో డిప్యూటీ సీఎం పర్యటన



అనంతగిరి మండలం పినకోట పంచాయతీ బల్లగరువులో శనివారం బాలింతలతో మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కల్యాణ్

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కె.పవన్‌కల్యాణ్ శనివారం అల్లూరి సీతారామరాజు జిల్లాలో పర్యటించారు. రూ.105 కోట్లతో 19 రోడ్ల నిర్మాణానికి అనంతగిరి మండలం పినకోట పంచాయతీ బల్లగరువులో శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా గిరిజనులతో మాట్లాడి డోలీ మోతల గురించి అడిగి తెలుసుకుని చలించి పోయారు. అక్కడ గిరిజన కళాకారులతో కలిసి థింసా నృత్యం చేశారు. గిరిజన సంప్రదాయ వాయిద్యాలను వాయించారు. -వార్త మెయిన్‌లో

కోకోనట్ ఎరీనాకు కోత ముప్పు



వైఎంసీఏ వద్ద కోతకు గురై పడిపోయిన కొబ్బరిచెట్లు

విశాఖపట్నం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): అలల తీవ్రతకు వారం రోజుల నుంచి సముద్ర తీరం భారీగా కోతకు గురవుతోంది. కురుసుర మ్యూజియం వెనుక భాగంలో రక్షణ గోడ చాలావరకూ ఇప్పటికే కూలిపోయింది. మ్యూజియం నుంచి ఉత్తరాన చిల్డ్రన్ పార్కు వరకూ కోత తీవ్రంగా ఉంది. శనివారం వైఎంసీఏ ఎదురుగా ఉన్న కోకోనట్ ఎరీనాలో చెట్లు కూడా కూలిపోయాయి. ఇంకా నోవాటెల్ హోటల్ వద్ద చిల్డ్రన్ పార్కు కూడా కోత ఎక్కువగా ఉంది.

ఫ్లాట్ల రేట్లూ సవరణ

రిజిస్ట్రేషన్ విలువల పెంపు

- బీచ్‌రోడ్డులో అత్యధికంగా 20 శాతం పెంపు ప్రతిపాదన
- మద్రిపాలెంలో 14 శాతం
- సీతమ్మధారలో 4 శాతం
- రుషికొండలో 9 శాతం
- అభ్యంతరాలు ఉంటే 24లోగా లిఖిత పూర్వకంగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో సమర్పించవచ్చు
- జనవరి ఒకటో తేదీ నుంచి అమలు
- సీతమ్మధారలో అత్యధికంగా మార్కెట్ రేటు చదరపు అడుగు రూ.8,200
- ఎండాడలో రూ.7 వేలు
- కూర్మన్నపాలెంలో రూ.3 వేలు



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

జిల్లాలో భూముల విలువలతో పాటు అపార్టుమెంట్లలో ఫ్లాట్ల విలువలను కూడా సవరిస్తూ అధికారులు ప్రతిపాదనలు రూపొందించారు. విశాఖపట్నంలో లావాదేవీలు ఎక్కువగా ఫ్లాట్లకు సంబంధించినవి కావడంతో ఆచితూచి నిర్ణయం తీసుకున్నారు. మార్కెట్ విలువలను క్షేత్రస్థాయిలో పరిశీలించి అత్యధికంగా 20 శాతం పెంచారు. కూర్మన్నపాలెంలో అయితే అసలు ఎటువంటి మార్పు చేయలేదు. అక్కడ చదరపు అడుగు ధర రూ.3 వేలు ఉండగా యథాతథంగా కొనసాగించాలని నిర్ణయించారు.

పారిశ్రామిక ప్రాంతమైన గాజువాక, కూర్మన్నపాలెం, మల్కాపురం ఏరియాల్లో చ.అ. ధర రూ.3 వేలకు మించి లేకపోవడం గమనార్హం. నగరంలోని సీతమ్మధారలో మార్కెట్ విలువ చ.అడుగు రూ.8,200 ఉన్నట్టుగా అధికారులు చూపించారు. అయితే అక్కడ ప్రభుత్వ ధర రూ.5,700 మాత్రమే ఉంది. దానిని నాలుగు శాతం పెంచి రూ.5,900 చేశారు. బీచ్‌రోడ్డులో ఎస్ఎఫ్‌టీ ధర రూ.5 వేలు ఉండగా రూ.6 వేలు చేశారు. అంటే 20 శాతం పెరగనున్నది. అదే అత్యధికం. మధురవాడలోని వీఎంఆర్‌డీఏ హరిత ప్రాజెక్టులో ప్రభుత్వ ధర చదరపు అడుగు రూ.4 వేలు ఉండగా మార్కెట్ ధర రూ.7 వేలు ఉంది. దానిని ఇప్పుడు రూ.4,200 చేశారు. మార్కెట్ రేటు ప్రకారం కొనుగోలు చేసినా దానిని సవరించిన రేటు ప్రకారం అడుగు రూ.4,200 చొప్పున రిజిస్టర్ చేసుకోవచ్చు. దానిపైనే స్టాంపు డ్యూటీ, రిజిస్ట్రేషన్ రుసుములు చెల్లించాలి. ప్రభుత్వం కల్పించిన వెసులుబాటు ప్రకారం నిర్ణయించిన రేటుకే డాక్యుమెంట్ రాసుకోవచ్చు. కొత్త రేట్లపై ఎవరికైనా అభ్యంతరాలు ఉన్నట్టయితే 24వ తేదీలోగా లిఖిత పూర్వకంగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో సమర్పించవచ్చు. పెంపు జనవరి ఒకటో తేదీ నుంచి అమలులోకి వస్తుంది.

ఇంకా ఎక్కడెక్కడ ఎలా పెరిగాయంటే...

- మురళీనగర్‌లో ప్రస్తుతం చ.అడుగు రూ.4,500 ఉండగా రూ.5,100 చేశారు. అక్కడ మార్కెట్ విలువ రూ.6,300 ఉంది.
- మద్రిపాలెం మెయిన్‌రోడ్డులో ప్రస్తుతం రూ.4,400 ఉండగా రూ.5 వేలు చేశారు. మార్కెట్ విలువ రూ.5 వేలు ఉంది.
- మాధవధారలో చ.అడుగు రూ.4,600 ఉండగా ... మిగతా 6వ పేజీలో

కొనసాగిన ముసురు

- గంభీరం, కాపులుప్పాడలో 77.25 మిల్లీమీటర్లు నమోదు



విశాఖపట్నం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): వాయుగుండం ప్రభావంతో జిల్లాలో వర్షాలు కొనసాగాయి. శుక్రవారం రాత్రి నుంచి శనివారం ఉదయం వరకూ ఏకధాటిగా వర్షం కురవడంతో నగరంలోని లోతట్టు ప్రాంతాల్లోకి నీరు చేరింది. పద్మనాభం, భీమిలి మండలాల్లో వరి పంట నీట మునిగింది. శుక్రవారం ఉదయం ఎనిమిది నుంచి శనివారం ఉదయం ఎనిమిది గంటల వరకు గంభీరం, కాపులుప్పాడలో 77.25, విశాఖ రూరల్ పరిధి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ వద్ద 73, ప్రహ్లాదపురంలో 70.75 మి.మీ.వర్షపాతం నమోదైంది. వర్షాల కారణంగా శనివారం విద్యా సంస్థలకు కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ సెలవు ప్రకటించారు.సాయంత్రానికి వర్షం తగ్గినా సముద్రంమీదుగా వస్తున్న గాలులకు చలి వాతావరణం నెలకొంది.వాయు గుండం బలహీనపడినా ఆదివారం కోస్తా, రాయలసీమల్లో అక్కడక్కడా వర్షాలు కురుస్తాయని వాతావరణ కేంద్రం పేర్కొంది. మత్స్యకారులు చేపల వేటకు వెళ్లరాదని విశాఖ తుఫాన్ హెచ్చరిక కేంద్రం హెచ్చరించింది.

సంతాన లేమితో సతమతం

గతంలో ఐదు శాతం మందిలోనే...

- ఇప్పుడు 15 శాతానికి పెరిగినట్టు గణాంకాల వెల్లడి
- ఇరువురిలో ఎవరైనా లేదా ఇరువురూ కారణం కావొచ్చు
- వృత్తిపరమైన ఒత్తిడి, ఆలస్యంగా వివాహాలు చేసుకోవడం వంటి వాటితో సమస్య రెట్టింపు
- ఆహారపు అలవాట్లు, జీవన విధానంలో మార్పులతో కొంత వరకూ సమస్య పరిష్కారం
- స్మోకింగ్, ఆల్కహాల్ వంటి దురలవాట్లకు దూరంగా ఉండాలి
- పోషకాలతో కూడిన ఆహారం తీసుకోవాలి
- 30 ఏళ్లలోపు వివాహాలు చేసుకోవాలి
- సంవత్సరాల తరబడి కుటుంబ నియంత్రణ పద్ధతులు పాటించడం మానుకోవాలి



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

నగరంలోని ఎం.వి.పి.కాలనీకి చెందిన మహిళ (34) ఒక సాఫ్ట్‌వేర్ కంపెనీలో పనిచేస్తోంది. సహచర ఉద్యోగితో ఏడేళ్ల కిందట వివాహం జరిగింది. ఇద్దరూ అన్యోన్యంగా ఉంటున్నారు. మొదట్లో రెండేళ్లపాటు పిల్లలను వద్దనుకున్నారు. ఐదేళ్ల నుంచి పిల్లల కోసం యత్నిస్తున్నా ఫలితం దక్కలేదు. దీంతో వైద్యులను సంప్రతించారు. ఇద్దరిలో కొన్నిరకాల ఇబ్బందులు ఉన్నట్టు గుర్తించిన వైద్యులు మందులు వినియోగించాల్సిందిగా సూచించారు. అప్పటికీ ఫలితం లేకపోతే మరో పద్ధతిలో యత్నించేందుకు సిద్ధం కావాలని సూచించారు.

సీతమ్మధారకు చెందిన యువకుడి (32)కి నాలుగేళ్ల కిందట వివాహం అయింది. ప్రముఖ సంస్థలో ఉద్యోగం చేస్తున్నాడు. వివాహం జరిగిన ఏళ్లు గడుస్తున్నా పిల్లలు లేకపోవడంతో తల్లిదండ్రుల ఒత్తిడి మేరకు దంపతులు వైద్యుల వద్దకు వెళ్లారు. ఇద్దరికీ పరీక్షలు నిర్వహించిన వైద్యులు అబ్బాయిలో సమస్య ఉన్నట్టు నిర్ధారించారు. స్పెర్మ్ కౌంట్ (వీర్యకణాల సంఖ్య) తక్కువగా ఉండడంతోపాటు నాణ్యత లేదని నిర్ధారించారు. కౌంట్ పెరిగేందుకు ప్రస్తుతం మందులు వాడుతున్నారు.

గడిచిన కొన్నాళ్లుగా సంతాన లేమితో బాధపడుతున్న దంపతుల సంఖ్య పెరిగింది. పదేళ్ల కిందటి వరకు సంతాన లేమితో బాధపడేవారు ఐదు శాతం కంటే తక్కువ ఉండేవారని, ఇప్పుడు 15 శాతానికి పెరిగినట్టు వైద్యులు చెబుతున్నారు. ఇందుకు అనేక అంశాలు కారణమవుతున్నాయంటున్నారు. అవేమిటో తెలుసుకుంటే సమస్యను పరిష్కరించుకునేందుకు అవకాశం ఉంటుందని ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ టి.రాధ తెలిపారు.

సంతానలేమి సమస్య అంటే.?

కుటుంబ నియంత్రణ పద్ధతులేవీ ... మిగతా 6వ పేజీలో

ఆరోగ్య శాఖలో బదిలీలు

- విజయనగరం డీఎంహెచ్‌ఓగా ఇమ్యునైజేషన్ ఆఫీసర్ జీవనరాణి
- రీజనల్ ట్రైనింగ్ సెంటర్ (మేల్) ప్రిన్సిపాల్‌గా శ్రీకాకుళం జిల్లా డీఎంహెచ్‌వో బి.మీనాక్షి
- అనకాపల్లి డీఎంహెచ్‌వోగా డాక్టర్ రవికుమార్

విశాఖపట్నం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): వైద్య, ఆరోగ్య శాఖలో భారీగా బదిలీలు జరిగాయి. జిల్లాలో పనిచేస్తున్న పలువురు ఇతర జిల్లాలకు వెళ్లగా, ఇతర జిల్లాలకు చెందిన అధికారులు జిల్లాకు వచ్చారు. జిల్లా ఇమ్యునైజేషన్ అధికారిణిగా పనిచేస్తున్న డాక్టర్ ఎస్.జీవనరాణి విజయనగరం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారిగా బదిలీ అయ్యారు. శ్రీకాకుళం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారిణిగా పనిచేస్తున్న డాక్టర్ బి.మీనాక్షి నగర పరిధిలోని మేల్ రీజనల్ ట్రైనింగ్ సెంటర్ (ఆర్‌టీసీ) ప్రిన్సిపాల్‌గా నియమితులయ్యారు. అనకాపల్లి జిల్లా కె.కోటపాడు సీహెచ్‌సీలో పనిచేస్తున్న డాక్టర్ ఎస్.శ్రీనివాస్ నగరంలోని విక్టోరియా ఆస్పత్రి సీఎస్ఆర్ ఎంవోగా నియమితులయ్యారు. తిరుపతి జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారిగా పనిచేస్తున్న డాక్టర్ యు.శ్రీహరి కేజీహెచ్‌లో కొన్నేళ్లుగా ఖాళీగా ఉన్న సీఎస్ఆర్‌వోగా ... మిగతా 6వ పేజీలో

ఐదేళ్లలో అభివృద్ధికి ప్రణాళిక

- 2028-29కల్లా వ్యవసాయంలో 10.95 శాతం వృద్ధి లక్ష్యం
- పారిశ్రామిక రంగంలో 15.55, సేవల రంగంలో 15.61 శాతం...
- 2022-23 ఆర్థిక సంవత్సరంలో జిల్లా స్థూల ఆదాయం రూ.1,19,268 కోట్లు
- 2028-29కల్లా రూ.2,58,565 కోట్లు సాధించాలని లక్ష్యం
- స్వర్ణాంధ్ర 2047కు అనుగుణంగా జిల్లా యాక్షన్ ప్లాన్-2029కు రూపకల్పన



విశాఖపట్నం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి):

స్వర్ణాంధ్ర-2047కు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రణాళిక రూపొందించారు. దానికి అనుగుణంగా జిల్లాల వారీగా విజనరీ యాక్షన్ ప్లాన్ ఖరారుకు ఆదేశించారు. ఈ మేరకు విశాఖ జిల్లా అధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు. వ్యవసాయం, పారిశ్రామిక, సేవల రంగాలు ప్రధానమైనవిగా గుర్తించి వాటిల్లో 2028-29కల్లా సాధించాల్సిన లక్ష్యాలపై అంచనాలు రూపొందించారు. ఇందుకు 2022-23 ఆర్థిక సంవత్సరం లెక్కలను ప్రామాణికంగా తీసుకున్నారు.

విశాఖ జిల్లా స్థూల ఆదాయం/ఉత్పత్తి 2022-23 సంవత్సరంలో రూ.1,19,268 కోట్లు (రాష్ట్ర స్థాయిలో జిల్లా వాటా 9.14 శాతం)గా నమోదైంది. ఆ సంవత్సరంలో లెక్కల మేరకు వ్యవసాయం నుంచి రూ.3,569 కోట్లు (3.19 శాతం), పారిశ్రామిక రంగాల నుంచి రూ.59,264 కోట్లు (52.93 శాతం), సేవల రంగం నుంచి 49,131 కోట్లు (43.88 శాతం)..మొత్తం రూ.1,11,964 కోట్ల ఆదాయం సమకూరింది. ఈ మూడు రంగాల్లో ఆదాయం 2028-29 కల్లా రూ.2,58,565 కోట్లు లక్ష్యంగా ప్రణాళికలో పొందుపరిచారు. వ్యవసాయంలో 10.95 శాతం వృద్ధితో రూ.6348 కోట్లు, పారిశ్రామిక రంగంలో 15.55 శాతం వృద్ధితో రూ.129,269 కోట్లు, సేవల రంగంలో 15.61 శాతం వృద్ధితో 1,22,948 కోట్ల ఆదాయం సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు 2029 నాటికి జిల్లా అభివృద్ధి కోసం ప్రణాళిలు రూపొందించి నివేదించామని కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ తెలిపారు. ప్రధానంగా వ్యవసాయం, పరిశ్రమలు, సేవల రంగాలుగా విభజించి ప్రణాళికలు ఖరారు చేశామన్నారు.

వ్యవసాయ రంగంలో 10.95 శాతం వృద్ధి లక్ష్యం

జిల్లాలో వ్యవసాయ భూముల ... మిగతా 6వ పేజీలో

వీఎంఆర్‌డీఏ స్థలాలు ఆక్రమిస్తే చర్యలు

విశాలాక్షినగర్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : వీఎంఆర్‌డీఏకి చెందిన షాపింగ్ కాంప్లెక్స్‌లు, ఖాళీ స్థలాలను ఆక్రమిస్తే చర్యలు తప్పవని ఆ సంస్థ చైర్మన్ ఎంవీ ప్రణవ్ గోపాల్, కమిషనర్ కేఎస్ విశ్వనాథన్ హెచ్చరించారు. శనివారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. కైలాసగిరి రోప్ వే కార్యాలయం ఎదురుగా ఉన్న రాక్‌పార్కులో సంస్థ నిర్ధేశించి కేటాయించిన స్థలం కంటే ఎక్కువగా ఆక్రమించి, వ్యాపార కారకలాపాలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించామన్నారు. సందర్శకులను ఆకట్టుకునేలా పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేస్తున్నామని, కొందరు సంస్థ ఆదాయానికి గండి కొడుతూ ఆయా ప్రాంతాల్లో వ్యాపార కార్యకలాపాల పేరుతో ఆక్రమణలకు పాల్పడుతున్నారని చెప్పారు. అటువంటి వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వ్యాపారులకు కేటాయించిన స్థలంలోనే వారి కార్యకలాపాలు నిర్వహించాలని సూచించారు.

నేటి నుంచి శ్రీ శారదా జయంత్యుత్సవాలు

భీమునిపట్నం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శివాలయం వీధిలో ఉన్న శ్రీ శారదా రామకృష్ణ సంఘంలో ఆదివారం నుంచి మంగళవారం వరకూ శారదా జయంత్యుత్సవాలు జరగనున్నాయి. ఈ సందర్భంగా నిర్వాహకులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నారు. 22న సాయంత్రం కూచిపూడి నృత్య ప్రదర్శన, 23న కర్ణాటక సంగీతం, 24న లక్ష కుంకుమార్చన, కోలాటం, కర్ణాటక సంగీతం నిర్వహించనున్నారు.

25న ఉమర్ అలీషా ఆశ్రమ వార్షికోత్సవం

భీమునిపట్నం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని బీచ్ రోడ్‌లో ఉన్న విశ్వ విజ్ఞాన విద్య ఆధ్యాత్మిక పీఠం 23వ వార్షికోత్సవం ఈనెల 25న నిర్వహించనున్నట్టు పీఠం ప్రతినిధి పింగళి ఆనందకుమార్ తెలిపారు. శనివారం ఆయన ప్రకటన విడుదల చేశారు. ఆ రోజు ఉదయం జరిగే ఆధ్యాత్మిక సభలో పీఠాధిపతి డాక్టర్ ఉమర్ అలీషా భక్తులను ఉద్దేశించి, అనుగ్రహభాషణ చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

తిరుప్పావై పాశుర విన్నపాలు

సింహాచలం, డిసెంబరు 21 (ఆంధ్ర జ్యోతి) : అప్పన్న సన్నిధిలో జరుగుతున్న ధనుర్మాసోత్సవాల్లో భాగంగా శనివారం తిరుప్పావై పాశుర విన్నపాలు జరిపారు. వేకువజామున సుప్రభాతసేవ, ప్రభాతారాధనలు తరువాత ఉత్సవమూర్తిని గోదాదేవిగా అలంకరించి, పల్లకిలో అధిష్ఠింపజేశారు. ఆలయ విద్వాంసుల నాదస్వరాలపనలు, కీర్తనలు, పండితుల వేద మంత్రోచ్చారణల నడుమ బేడా మండపంలో తిరువీధి ఉత్సవం నిర్వహించారు. తరువాత గోదాదేవి సన్నిధిలో అధ్యాపకులు తిరుప్పావై పాశురాలను విన్నవించారు.

సెల్‌ఫోన్లు భద్రపరచడానికి అధిక ధర వసూలు

సింహాచలం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : అప్పన్న స్వామి దర్శనానికి వస్తున్న భక్తుల సెల్‌ఫోన్లు భద్రపరచడానికి ఏర్పాటు చేసిన కౌంటర్ వద్ద కాంట్రాక్ట్ సిబ్బంది అధిక ధర వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. స్వామివారి దర్శనానికి వచ్చే వారు తమ సెల్‌ఫోన్లు, లాప్‌టాప్‌లు, బ్యాగ్‌లను దేవస్థానం ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్లలో భద్రపరచుకోవాల్సి ఉంది. ఈమేరకు దేవస్థానం బహిరంగ వేలం ద్వారా కాంట్రాక్టర్‌కు ఈ హక్కును కల్పిస్తుంది. తిరుమలలో భక్తుల సెల్‌ఫోన్లు ఉచితంగా భద్రపరుస్తుండగా, శ్రీకాళహస్తి, విజయవాడ వంటి ప్రముఖ ఆలయాల వద్ద రూ. 5 వసూలు చేస్తున్నారు.కానీ సింహగిరిపై రూ. 10 వసూలు చేస్తున్నారు. రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా సెల్‌ఫోన్ భద్రపరిచే ధరను పెంచడం పట్ల భక్తుల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అధికారులు ఈ విషయమై దృష్టిసారించాలని పలువురు కోరుతున్నారు.

98వ వార్డులో రూ.3 కోట్లతో పనులు

సింహాచలం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 98వ వార్డులో రూ. 3 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టడానికి స్థాయీ సంఘం ఆమోదం తెలిపినట్టు వార్డు కార్పొరేటర్ పిసిని వరాహ నరసింహం తెలిపారు. శనివారం ఆయన ప్రకటన విడుదల చేశారు. ఈ నిధులతో వార్డులో బీటి రోడ్లు, సీసీ రోడ్లు, కాలువలు నిర్మించనున్నట్టు చెప్పారు.

ఏఐటీయూసీ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యురాలుగా భవాని

భీమునిపట్నం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యురాలుగా పట్టణంలోని ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న ఎ. భవాని ఎన్నికయ్యారు. విజయవాడలో గురువారం ఆ యూనియన్ రాష్ట్ర 6వ మహాసభల సందర్భంగా జరిగిన ఎన్నికల్లో సభ్యులు ఆమెను ఎన్నుకున్నారు. ఈ మేరకు శనివారం ఆస్పత్రిలో జరిగిన కార్యక్రమంలో జిల్లా యూనియన్ సభ్యులు, సిబ్బంది ఆమెను అభినందించారు.

రెవెన్యూ సదస్సు రేపు

సింహాచలం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 98వ వార్డులోని ప్రియదర్శిని కల్యాణ మండపంలో సోమవారం రెవెన్యూ సదస్సు జరగనున్నట్టు కార్పొరేటర్ పివి నరసింహం తెలిపారు. శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. సదస్సు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 వరకు జరుగుతుందని, స్థానికులు సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు.



పాండ్రంగి గోస్తనీ నది కాజువే వద్ద ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు



గోస్తనీ నది సమీపంలో ఉన్న పొలాలను పరిశీలిస్తున్న తహసీల్దార్ ఆనందరావు

ఉధృతంగా గోస్తనీ నది

పద్మనాభం/పద్మనాభం రూరల్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలో నాలుగు రోజుల పాటు కురిసిన వర్షాలకు గోస్తనీ నది ఉధృతంగా ప్రవహిస్తోంది. ఎగువ ప్రాంతాల నుంచి వచ్చిన నీటితో నది ప్రవాహం పెరిగింది. పాండ్రంగి కాజువేపై నుంచి నీరు పారుతుండడంతో రాకపోకలను నిలిపివేస్తూ రెవెన్యూ అధికారులు శనివారం హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. ఆ ప్రాంతాన్ని తహసీల్దార్ ఆనందరావు సందర్శించి, ప్రజలను అప్రమత్తం చేశారు. అలాగే పంట పొలాలను పరిశీలించి, రైతులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. దెబ్బతిన్న పంటలను పరిశీలించి నివేదికలు తయారు చేయాలని వ్యవసాయ శాఖాధికారులకు సూచించారు. ఆయనతో పాటు వీఆర్‌ఓ రఘు ఉన్నారు.



ఏనుగులపాలెంలో పంట పొలంలో చేరిన నీరు



పవన్ కల్యాణ్ వెళ్లే మార్గంలో ప్లకార్డులు చూపుతున్న పంచ గ్రామాల భూ బాధితులు

అభివాదం చేస్తూ.. ముందుకు సాగిన పవన్

సింహాచలం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ శనివారం సింహాచలం మీదుగా పెందుర్తి వెళ్లారు. తిరిగి అదే మార్గంలో వచ్చి ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు సాగారు. పవన్ పర్యటన విషయం ముందుగా తెలుసుకున్న 98వ వార్డు జనసేన పార్టీ అధ్యక్షుడు మజ్జి సూరిబాబు, ప్రజా రైతు సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి టివి కృష్ణంరాజు, తదితరులు నేరుగా ఆయన్ను కలిసి సమస్యలపై వినతులు సమర్పించాలని భావించారు. ఈమేరకు గోశాల కూడలి వద్ద రెండుసార్లు ప్లకార్డులు, బ్యానర్లు పట్టుకుని నిరీక్షించారు. కానీ పవన్ కారులో నుంచి అభివాదం చేస్తూ ముందుకు వెళ్లిపోయారు. దీంతో పంచ గ్రామాల భూ సమస్యపై వినతులు ఇవ్వాలని వచ్చిన వారంతా నిరాశతో వెనుతిరిగారు.

నిత్యాన్న ప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం

సింహాచలం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్న ప్రసాద పథకానికి అడివివరం గ్రామానికి చెందిన లొగిశ దుర్గమ్మ రూ. లక్ష విరాళంగా సమర్పించారు. విరాళం మొత్తం రూ.1,05,001లను నగదు రూపంలో దేవాలయ పీఆర్‌ఓ విభాగం పర్యవేక్షణాధికారి పద్మనాభరాజుకు శనివారం ఆమె అందజేశారు. దాత కుటుంబ సభ్యులకు అధికారులు స్వామివారి అంతరాలయ దర్శనం కల్పించి, వేదాశీర్వచనాలు, శేష వస్త్రం, ప్రసాదాలు అందజేశారు.

వైభవంగా అప్పన్న నిత్య కల్యాణం

సింహాచలం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి ఆర్జిత నిత్య కల్యాణం శనివారం వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు.ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం పాంచరాత్రాగమశాస్త్ర విధానంలో కల్యాణ క్రతువు జరిపారు. మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.



ప్రత్యేక బహుమతులు పొందిన విద్యార్థులతో ముఖ్య అతిథులు

అవంతిలో ముగిసిన వైజ్ఞానిక ప్రదర్శన

భీమునిపట్నం (రూరల్), డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) :తగరపువలస అవంతి ఇంజనీరింగ్ కళాశాలలో జ్ఞాన్ 2కె 24 పేరుతో రెండు రోజులుగా జరుగుతున్న వైజ్ఞానిక ప్రదర్శన శనివారంతో ముగిసింది. వివిధ కళాశాలలకు చెందిన మూడు వేల మంది విద్యార్థులు 102 ప్రాజెక్టులను ప్రదర్శించగా, ప్రతిభ చూపిన 340 మందికి కళాశాల చైర్మన్ ముత్తంశెట్టి శ్రీనివాసరావు ప్రశంసాపత్రాలు అందజేశారు. అలాగే రూ. 2 లక్షల నగదు బహుమతులు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జేఎన్‌టీయూ డైరెక్టర్ కె. బాబు, డబ్ల్యూఎస్ఎస్ సంస్థ ఉపాధ్యక్షుడు ఆర్‌ఎల్ నారాయణ, తిరుపతి శ్రీసిటీకి చెందిన ప్రొఫెసర్ దాసరి చంద్రమోహన్, ఏపీ ట్రాన్స్‌కో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ లక్ష్మీనారాయణ, ఐఐటీ భువనేశ్వర్ సహాయ ప్రొఫెసర్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.



సదస్సులో అధికారులకు సమస్యలను తెలియజేస్తున్న టీడీపీ నేత సురేశ్

ప్రభుత్వ భూములు స్వాధీనం చేసుకోవాలని వినతి

తగరపువలస, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : తగరపువలసలో వంద ఎకరాల మేర ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమయ్యాయని, వాటిని స్వాధీనం చేసుకుని ప్రభుత్వ అవసరాలకు వినియోగించాలని టీడీపీ జిల్లా కార్యదర్శి పిట్టా సురేశ్ కోరారు. శనివారం తగరపువలసలో జరిగిన రెవెన్యూ సదస్సులో ఆయన అధికారులకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 200 గ్రామాలకు కూడలిగా, వ్యాపార కేంద్రంగా ఉన్న తగరపువలసలో ప్రభుత్వ భూమి సెంటు కూడా లేదన్నారు. గ్రామ రెవెన్యూ పరిధిలో 156 ఎకరాల ప్రభుత్వ భూమి రికార్డుల్లో ఉండగా, 45 ఎకరాలు మాత్రమే రోడ్లు, ఇతర అవసరాలకు వినియోగించారని, మిగిలిన భూమి అన్యాక్రాంతమైందన్నారు. దీనిపై విచారణ జరపాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ రామారావు టీడీపీ నాయకులు సూరిబాబు. నీలకంఠం, గిడుతూరి శ్రీనివాసరావు, పైడిరాజు, చంద్రమౌళి, కొప్పల కృష్ణ, బంక ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వైఎస్ జగన్ జన్మదిన వేడుకలు

భీమునిపట్నం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు భీమిలి పట్టణంలో శనివారం ఘనంగా జరిగాయి. 3వ వార్డు పార్టీ అధ్యక్షుడు అల్లిపిల్లి నరసింగరావు ఆధ్వర్యంలో చిన్నబజారు జంక్షన్, అనిల్ కాంప్లెక్స్ జంక్షన్, తోటవీధిలో వున్న వైఎస్సార్ విగ్రహాలకు నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం గంటస్తంభం వద్ద జరిగిన వేడుకల్లో కేక్ కట్ చేసి, స్వీట్లు పంపిణీ చేశారు. మునిసిపల్ లాల్ బహదూర్ శాస్త్రి మార్కెట్‌లో పేదలకు దుప్పట్లు, ప్రభుత్వాస్పత్రిలో రోగులకు పండ్లు, పాలు అందజేశారు. అలాగే బింగి హరికిరణ్‌రెడ్డి, రాంభుక్త ప్రభాకర నాయుడు ఆధ్వర్యంలో కొంకివీధిలో కేక్ కట్ చేసి, మిఠాయిలు పంచారు.చేపలుప్పాడ వైసీపీ కార్యాలయంలో జరిగిన వేడుకల్లో వార్డు కార్పొరేటర్ దౌలపల్లి ఏడుకొండలరావు మత్స్యకార మహిళలకు దుప్పట్లు, చీరలు పంపిణీ చేశారు.

పద్మనాభం : పద్మనాభంలోని వైసీపీ కార్యాలయంలో నాయకులు రక్తదాన శిబిరం నిర్వహించారు. విశాఖ లైఫ్ కేర్ బ్లండ్ బ్యాంకు సిబ్బంది 53 మంది దాతల నుంచి రక్తం సేకరించారు.



భీమిలి ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు రొట్టెలు, పండ్లు పంపిణీ చేస్తున్న నాయకులు

ఈ కార్యక్రమంలో ఎంపీపీ కె.రాంబాబు, వైసీపీ మండల అధ్యక్షుడు కె. లక్ష్మణరావు, నాయకులు బంగారప్పడు, పద్దు, అప్పలరాజు పాల్గొన్నారు.

తగరపువలస : జీరుపేటలోనూ వేడుకలు నిర్వహించారు. వైసీపీ 2వ వార్డు కన్వీనర్ శిల్ల సరళారాణి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఎండాడ/ఆనందపురం : ఎండాడ, ఆనందపురంలోనూ జగన్ జన్మదిన వేడుకలు జరిగాయి. ఎండాడలో 5, 6, 7, 8 వార్డుల నాయకుల ఆధ్వర్యంలోనూ, ఆనందపురంలో మండల పార్టీ అధ్యక్షుడు బంక సత్యం ఆధ్వర్యంలోనూ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

దేవదాయ శాఖ భూముల కౌలు వేలం వాయిదా

పద్మనాభం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గంధవరంలో దేవదాయ శాఖ పరిధిలోని బంగారమ్మ, ముత్యాలమ్మ, పైడితల్లి అమ్మవార్లకు చెందిన భూముల కౌలు వేలం తాత్కాలికంగా వాయిదా వేసినట్టు దేవదాయ శాఖ పద్మనాభం గ్రూపు ఆలయాల ఈఓ ఎస్. నానాజీబాబు తెలిపారు. శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. గ్రామంలోని దేవదాయ శాఖ భూములు 24 ఎకరాలు ఉండగా ఈనెల 20న 8.91 ఎకరాలకు వేలం ద్వారా రైతులకు కౌలుకు ఇచ్చామన్నారు. మిగిలిన 14.09 ఎకరాలపై వివాదాలు ఉండడం వల్ల వాటికి వేలం పాటను తాత్కాలికంగా వాయిదా వేశామని చెప్పారు.

ప్రేమ పేరుతో బాలికపై అత్యాచారం

మద్దిలపాలెం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ప్రేమ పేరుతో బాలికను లోబర్చుకున్న యువకుడిపై శనివారం మూడో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. రేసపువానిపాలేనికి చెందిన ఆటో డ్రైవర్ ముకేశ్‌కుమార్‌కు అదే ప్రాంతానికి చెందిన ఓ బాలిక పరిచయమైంది. వివాహం చేసుకుంటానని చెప్పి పలుమార్లు బాలికపై అత్యాచారానికి పాల్పడ్డాడు. తర్వాత బాలికను పట్టించుకోవడం మానేశాడు. బాలిక తనను వివాహం చేసుకోవాలని ముకేష్‌కుమార్‌ను నిలదీసింది. అతను ససేమిరా అనడంతో పోలీసులను ఆశ్రయించింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ సురేష్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఫ్లాట్ల రేట్లూ సవరణ

... 5వ పేజీ తరువాయి

రూ.5,100 చేశారు. అక్కడ మార్కెట్ రేటు రూ.6,300.

- అబిద్‌నగర్, అక్కయ్యపాలెం 80 అడుగుల రోడ్డులో ప్రస్తుతం రూ.5,500 ఉండగా రూ.5,600 చేశారు. అక్కడ మార్కెట్ విలువ రూ.7,800 ఉంది.
- సీతమ్మధార, పీ అండ్ టీ కాలనీ, బాలయ్య శాస్త్రి లేఅవుట్‌లలో రూ.5,700 ఉండగా రూ.5,900 చేశారు. అక్కడ మార్కెట్ విలువ రూ.8,200 ఉంది.
- నాయుడుతోట, దుర్గానగర్, కృష్ణానగర్‌లలో చ.అడుగు రూ.2,600 ఉండగా రూ.2,900 చేశారు. అక్కడ మార్కెట్ విలువ రూ.4,900గా ఉంది.
- ప్రహ్లాదపురం కాలనీలో రూ.3,200 ఉండగా రూ.3,600 చేశారు. మార్కెట్ రేటు రూ.6 వేలు ఉంది.
- లా కాలేజీ రోడ్డు, ఎంవీపీ సిటీలో చ.అడుగు రూ.4 వేలు ఉండగా రూ.4,200 చేశారు. మార్కెట్ రేటు రూ.7 వేలు ఉంది.
- కొమ్మాది జంక్షన్‌లో రూ.4,500 ఉండగా దానిని రూ.200 పెంచి రూ.4,700 చేశారు. అక్కడ మార్కెట్ రేటు రూ.6 వేలు ఉంది.
- సాయిప్రియా లేఅవుట్‌లో రూ.3,500 ఉండగా 200 పెంచి రూ.3,700 చేశారు. అక్కడ మార్కెట్ విలువ రూ.6 వేలు ఉంది.
- రుషికొండ వుడా లేఅవుట్‌లో రూ.3,500 ఉండగా రూ.3,800 చేశారు. అక్కడ మార్కెట్ రేటు రూ.5,500 ఉంది.
- ఎండాడలో రూ.3,500 ఉండగా రూ.300 పెంచి రూ.3,800 చేశారు. అక్కడ మార్కెట్ రేటు రూ.5,500 ఉంది.
- ఇండియా బుల్స్, ఐటీ పార్కు, స్కై లైన్, స్కై పార్క్, ఎంకే గోల్డ్, ఎంకే కోస్టు తదితర అపార్ట్‌మెంట్లలో చ.అడుగు ధర రూ.4 వేలు ఉండగా దానిని రూ.4,200 చేశారు. మార్కెట్ రేటు రూ.7 వేలు ఉంది.
- ఎం.వి.పిలో చ.అడుగు రూ.4,500 ఉండగా దానిని రూ.5,300 చేశారు.
- లాసన్స్ బే కాలనీలో రూ.5 వేలు ఉండగా రూ.5,300 చేశారు.

పేదలకు ఉచిత వైద్యం అందించాలి

» ఉత్తర ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు

విశాఖపట్నం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : సీతమ్మధార నార్త్ ఎక్స్‌టెన్షన్‌లోని ఎన్ఆర్‌ఐ ఆస్పత్రిలో పేదలకు ఉచిత వైద్యం చేయడం లేదని, నిబంధనలు పాటించడం లేదని ఉత్తర ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు ఆరోపించారు. శనివారం ఆయన కలెక్టర్‌కు లేఖ రాశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీతమ్మధార నార్త్ ఎక్స్‌టెన్షన్ లేఅవుట్‌ను వుడా వేసిందని, అందులో సామాజిక ప్రయోజనాల కోసం కేటాయించిన భూమిలో 4,372 గజాలను గజం రూ. 270 చొప్పున తక్కువ ధరకు 1990లో ఆస్పత్రి నిర్మాణం కోసం ఎన్ఆర్‌ఐ వైద్యులకు కేటాయించిందన్నారు.వుడా చేసిన అమ్మకం ఒప్పందం ప్రకారం ఆస్పత్రిలో 10 నుంచి 20 శాతం వరకు పేద రోగులకు ఉచిత వైద్యం చేయాలని, గదులు కేటాయించాలని ఉందన్నారు. కానీ యాజమాన్యం ఆస్పత్రిని మూడు నెలలు క్రితం కిమ్స్ మేనేజ్‌మెంట్‌కు విక్రయించిందన్నారు. అందులో 300 పడకలు ఉన్నాయని, నిబంధనల ప్రకారం 45 నుంచి 60 పడకలు పేదలకు కేటాయించి ఉచిత వైద్యం చేయాల్సి ఉందన్నారు. కానీ కొత్త యాజమాన్యం దీన్ని అమలు చేయడం లేదని, పైగా భారీ ఫీజులు వసూలు చేస్తున్నారని చెప్పారు. వుడా సేల్ డీడ్ ప్రకారం పేదలకు ఉచిత వైద్య సేవలు అందించేలా కిమ్స్ యాజమాన్యాన్ని ఆదేశించాలని కోరారు.

ఆరోగ్య శాఖలో బదిలీలు

... 5వ పేజీ తరువాయి

నియమితులయ్యారు.

అనకాపల్లి డీఎంహెచ్‌వోగా రవికుమార్

చిత్తూరు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారిగా పనిచేస్తున్న డాక్టర్ ఓ.ప్రభావతి దేవి పాడేరు జిల్లా అడిషనల్ జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారిణిగా నియమితు లయ్యారు. కాగా, విజయనగరం జిల్లా గజపతి నగరం ఏరియా ఆస్పత్రిలో పనిచేస్తున్న డాక్టర్ పి.రవికుమార్ అనకాపల్లి జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారిగా నియమితులయ్యారు.

సంతానలేమితో సతమతం

... 5వ పేజీ తరువాయి

పాటించకుండా దంపతులు ఇద్దరూ ఏడాదిపాటు కలిసి ఉంటున్నా సంతానం కలగకపోతే సంతానలేమి సమస్యగా పేర్కొంటారు. ఏడాది దాటితే వైద్యులను సంప్రతించాల్సిన అవసరం ఉందని నిపుణులు చెబుతున్నారు. ప్రపంచవ్యాప్తంగా 15 శాతం మంది జంటలు ఈ తరహా సమస్యతో బాధపడుతున్నట్టు ప్రపంచ ఆరోగ్య సంస్థ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ఇటువంటి వారంతా వైద్యులను సంప్రతించి సమస్యను తెలుసుకోవడం చాలా కీలకంగా డాక్టర్ రాధ పేర్కొన్నారు. సంతాన లేమి సమస్యకు ఏ ఒక్కరో కారణం కాదన్న విషయాన్ని గుర్తించాల్సిన అవసరం ఉంది. పిల్లలు పుట్టకపోవడానికి మహిళలు 30 శాతం, పురుషులు 30 శాతం, మరో 30 శాతం ఇద్దరూ కారణం కావచ్చునని, పది శాతం కారణాలు తెలియవని వైద్యులు చెబుతున్నారు. అయితే, సంతానలేమి సమస్య అనగానే మహిళలను చాలామంది బాధ్యులు చేస్తుంటారని, ఇది తప్పు అని కేజీహెచ్ గైనాకాలజీ విభాగ సీనియర్ వైద్య నిపుణులు డాక్టర్ సంధ్యాదేవి పేర్కొన్నారు.

మహిళల్లో సమస్యలు ఇవే

మహిళల్లో సంతానలేమి సమస్యకు కారణాలుగా వైద్యులు పలు అంశాలను పేర్కొంటున్నారు. ట్యూబల్ బ్లాకేజీ, ఫెలోపియన్ ట్యూబులు మూడుకుపోవడం, హార్మోన్ల అసమతుల్యత కారణంగా అండం విడుదల కాకపోవడం, పూర్తిస్థాయిలో ఎగ్ ఫార్మ్ కాకపోవడం, అండాశయంలో కొన్నిరకాల సమస్యలు వంటివి సంతానలేమి సమస్యకు కారణమవుతున్నాయి.

పురుషుల్లో ఇబ్బందులు..

స్పెర్మ్ కౌంట్ (వీర్య కణాల సంఖ్య) తగ్గడం, నాణ్యత లోపించడం, కణాల కదలిక క్షీణించడం (సాధారణంగా 100 ఎంఎల్ వీర్యంలో 15 మిలియన్ల కణాలు ఉండాలి) వంటి కారణాలుగా చెబుతున్నారు.

ఈ కారణాలతోనే సమస్య..

మహిళలు, పురుషుల్లో ఈ సమస్య రావడానికి జీవన విధానంలో వచ్చిన మార్పులు, అలవాట్లు కారణంగా వైద్యులు చెబుతున్నారు. మహిళల్లో థైరాయిడ్, హార్మోన్ల అసమతుల్యత, పీసీఓడీ, అధిక బరువు వంటి ఇబ్బందులు అధికం అవుతున్నాయి. ఇవి అండం విడుదల కాకపోవడానికి కారణమవుతున్నాయి. అందుకు శారీరక శ్రమ లేకపోవడం, పోషకాలు లేని ఆహారాన్ని తీసుకోవడం, జంక్ ఫుడ్ తీసుకోవడం, సరైన నిద్ర లేకపోవడం వంటి అంశాలు దోహదం చేస్తున్నాయి. పురుషుల్లో ధూమపానం, మద్యపానం, ఒబెసిటీ, ఆహారపు అలవాట్లు, ఇతర వ్యసనాలు కారణమవు తున్నాయి. ఇద్దరిలోనూ వృత్తిపరమైన టెన్షన్, ఒత్తిడి, ఆలస్యంగా వివాహాలు చేసుకోవడం వంటి అంశాలు ఈ సమస్యను మరింత రెట్టింపు చేస్తున్నట్టు వైద్యులు పేర్కొంటున్నారు.

పరీక్షలో నిర్ధారణ

సంతానలేమి సమస్యకు అసలు కారణం ఏమిటో నిర్ధారించిన తరువాత వైద్యులు ఏం చేయాలో వివరిస్తారు. ఇందుకోసం పరీక్షలు చేయిస్తారు. దీన్నే ఇవాల్యూయేషన్ ప్రాసెస్‌గా చెబుతారు. పరీక్షల్లో స్పెర్మ్ కౌంట్ తక్కువగా ఉండడం వల్ల పిల్లలు పుట్టడం లేదా? లేక ఎగ్ రిలీజ్‌లో ఉన్న ఇబ్బందులు ఉన్నాయా?...అనేది నిర్ధారిస్తారు. మందుల వల్ల ప్రయోజనం లేనట్టయితే ఇన్‌విట్రో ఫెర్టిలైజేషన్ (ఐవీఎఫ్)కు రిఫర్ చేస్తారు. ఇందులో వివిధ రకాల పద్ధతులు ఉంటాయి. సాధారణంగా భార్య, భర్త కలిసినప్పుడు జరిగే ప్రక్రియను సాంకేతిక పద్ధతులను అనుసరించి పిండం ఏర్పడేలా చేసి పిల్లలు పుట్టేలా చేస్తారు.

తగిన జాగ్రత్తలతో చెక్..

కొన్నిరకాల జాగ్రత్తలను తీసుకోవడం వల్ల సంతానలేమి సమస్య ఉత్పన్నం కాకుండా చూసుకునేందుకు అవకాశం ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. ఒత్తిడి లేని జీవన విధానాన్ని కొనసాగించడం, శారీరక శ్రమ చేయడం, బరువును నియంత్రణలో ఉంచుకోవడం, స్మోకింగ్, ఆల్కహాల్ వంటి దురలవాట్లకు దూరంగా ఉండడం, పోషకాలతో కూడిన ఆహారాన్ని తీసుకోవడం, 30 ఏళ్లలోపు వివాహాలు చేసుకోవడం, కెరియర్, ఇతర అవకాశాలు అంటూ పెళ్లైన తరువాత సంవత్సరాల తరబడి కుటుంబ నియంత్రణ పద్ధతులు పాటించడం వంటి వాటికి దూరంగా ఉండడం ద్వారా సంతానాన్ని పొందవచ్చునని నిపుణులు సూచిస్తున్నారు.

పెరుగుతున్న కేసులు

సంతానలేమితో బాధపడే వారికి వైద్య సేవలు అందించేందుకు నగరంలో 30 వరకు ఫెర్టిలిటీ సెంటర్లు ఏర్పాటయ్యాయి. ఒక్కో ఆస్పత్రిలో నిత్యం కనీసం పది నుంచి 20 మంది సేవలను పొందుతున్నారు. ఈ సంఖ్య రానున్న రోజుల్లో మరింత పెరిగే అవకాశం ఉందంటున్నారు. వైద్య రంగంలో ప్రస్తుతం ఇదే అతిపెద్ద వ్యాపారంగా కొనసాగుతోంది.

యువ జంటల్లో కూడా పెరుగుతున్న సమస్య

- డాక్టర్ ఐ.వాణి, గైనకాలజీ వైద్యులు, కేజీహెచ్

గతంతో పోలిస్తే సంతానలేమితో బాధపడుతున్న జంటల సంఖ్య గణనీయంగా పెరిగింది. కేజీహెచ్‌కు దాదాపు 15 నుంచి 20 శాతం ఇటువంటి కేసులు వస్తున్నాయి. ఇరవై ఐదేళ్లలోపు వయసున్న అమ్మాయిల్లో కూడా ఎగ్ రిలీజ్ సమస్య, అబ్బాయిల్లో స్పెర్మ్ కౌంట్ తక్కువగా ఉండడం వంటివి చూస్తున్నాం. జీవన విధానంలో వచ్చిన మార్పుల కారణంగా ఈతరహా సమస్యలు పెరుగుతున్నాయి. కొన్ని రకాల జాగ్రత్తలు తీసుకుంటే ఇటువంటి ఇబ్బందులు నుంచి బయటపడ వచ్చు. కొందరు కావాలనే కొన్నాళ్లపాటు పిల్లలను వద్దనుకుంటారు. వృత్తిపరమైన ఒత్తిళ్లు, ఇతర ఇబ్బందులతో తరువాత కావాలనుకున్నా ఫలితం దక్కడం లేదు. కాబట్టి, 30 ఏళ్లలోపు పిల్లలు వద్దు అనుకునే ఆలోచన నుంచి యువ జంటలు రావాలి. పిల్లలు పుట్టిన తరువాత కూడా జీవితంలో ఉన్నత స్థానాలకు వెళ్లినవారు ఎంతోమంది ఉన్నారు. పిల్లలు పుడితే జీవితాల్లో పైకి ఎదగలేమన్న ఆలోచన వద్దు. పిల్లలు పుట్టలేదని మానసిక వేదనకు గురికావాల్సిన అవసరం లేదు. అధునాతన వైద్య పద్ధతులను అనుసరించి పిల్లలను పొందేందుకు అనువైన మార్గాలు ఉన్నాయి.

ఐదేళ్లలో అభివృద్ధికి ప్రణాళిక

... 5వ పేజీ తరువాయి

విస్తీర్ణం చాలా తక్కువ. రాష్ట్ర స్థాయిలో విశాఖ జిల్లా చివరి స్థానం (26)లో నిలిచింది. వ్యవసాయ రంగం ద్వారా 2022-23లో వచ్చిన ఆదాయం రూ.3,569 కోట్లు. దీన్ని ఏటా 10.95 శాతం వృద్ధితో 2028-29కల్లా రూ.6,348 కోట్లకు పెంచాలని లక్ష్యంగా నిర్ణయించారు. శాఖల వారీగా వివరాలు పరిశీలిస్తే వ్యవసాయం నుంచి రూ.86 కోట్లు ఆదాయం రాగా నాలుగు శాతం వృద్ధితో 2029 కల్లా ఏటా రూ.102 కోట్లు, ఉద్యానవనాల నుంచి రూ.477 కోట్లు ఉండగా ఏటా ఏడు శాతం వృద్ధితో రూ.711 కోట్లు, లైవ్ స్టాక్ నుంచి రూ.1085 కోట్లు సమకూరగా ఏటా పది శాతం వృద్ధితో రూ.1,932 కోట్లు, మత్స్య శాఖ నుంచి రూ.1,833 కోట్లు రాగా ఏటా 13 శాతం వృద్ధితో రూ.3,488 కోట్లకు పెంచాలని నిర్ణయించారు. బీడు భూముల్లో పంటల సాగు ప్రధానంగా నేచురల్ ఫార్మింగ్, చిరుధాన్యాలు, తోటల పెంపకం, పంట నిల్వకు శీతల గిడ్డంగులు, మేలు జాతి పశువుల పెంపకం, సముద్ర మత్స్య ఉత్పత్తులు పెంపు, ఫిష్ జట్టీలు ఏర్పాటు, చేపల వేటకు మత్స్యకారులకు ఆధునిక పనిముట్లు అందజేయడం వంటివి చేయాలని ప్రణాళికలు పొందుపరిచారు.

పారిశ్రామిక రంగంలో 15.55 శాతం వృద్ధి లక్ష్యం

పారిశ్రామిక ఉత్పత్తిలో 2022-23లో రూ.59,264 కోట్ల ఆదాయంతో రాష్ట్రంలో విశాఖ జిల్లా ప్రథమ స్థానంలో ఉంది. ఏటా 15.55 శాతం వృద్ధితో 2028-29కల్లా ఆదాయం రూ.1,29,269 కోట్లకు పెంచాలని లక్ష్యంగా నిర్ణయించారు. 2022-23లో మైనింగ్ శాఖ నుంచి రూ.30 కోట్లు ఆదాయం రాగా ఏటా మూడు శాతం వృద్ధితో రూ.38 కోట్లకు పెంచనున్నారు. ఉత్పత్తి రంగంలో రూ.10,031 కోట్ల ఆదాయం రాగా 18 శాతం వృద్ధితో రూ.25,841 కోట్లకు, విద్యుత్, గ్యాస్, నీటి సరఫరా వాటా కింద రూ.2,829 కోట్లు రాగా ఏటా 15 శాతం వృద్ధితో 6,543 కోట్లు ఆదాయం సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ప్రస్తుతం ఉన్న పరిశ్రమల్లో మరింత ఉత్పత్తి పెంచడం, చిన్న, కుటీర, మధ్యతరహా పరిశ్రమ రంగాన్ని ప్రోత్సహించాలని ప్రతిపాదించారు. ప్రస్తుతం ఈ రంగాల్లో రూ.144.61 కోట్లతో 813 యూనిట్లు స్థాపించి 5129 మంది ఉపాధి కల్పించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రోత్సాహంతో అమలుచేస్తున్న ఉపాధి పథకాలను వేగంగా మంజూరుచేయడం, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు తరచు శిక్షణ శిబిరాలు నిర్వహించి ప్రోత్సహించడం వంటి చేపట్టాలని నిర్ణయించారు.

సేవల రంగంలో 15.61 శాతం వృద్ధి లక్ష్యం

జిల్లాలో 2022-23లో సేవల రంగం నుంచి 43.88 శాతం వాటాతో రూ.49,131 కోట్లు ఆదాయం వచ్చింది. దీనిని 2028-29కల్లా ఏటా 15.61 శాతం వృద్ధితో రూ.1,12,948 కోట్లకు పెంచాలని లక్ష్యంగా నిర్ణయించారు. వ్యాపారం, హోటళ్లు, రెస్టారెంట్ల నుంచి రూ.13,917 కోట్ల ఆదాయం రాగా ఏటా 18 శాతం వృద్ధితో రానున్న ఐదేళ్లలో రూ.34,910 కోట్లకు చేర్చాలని నిర్దేశించుకున్నారు. రవాణా, గిడ్డంగులు తదితర రంగాల నుంచి రూ.9,350 కోట్ల ఆదాయం రాగా ఏటా 17 శాతం వృద్ధితో రూ.22,684 కోట్లు, రియల్ ఎస్టేట్, దాని అనుబంధ రంగాల నుంచి రూ.6,464 కోట్ల ఆదాయం రాగా ఏటా 16 శాతం వృద్ధితో రూ.15,208 కోట్లు, ఇతర సేవల విభాగాల నుంచి రూ.6,667 కోట్లు రాగా 15.74 శాతంతో రూ.12,070 కోట్లు ఆదాయం సేకరించాలని ప్రతిపాదించారు. సేవల రంగం ఆదాయం పెంపునకు సంబంధించి ప్రధానంగా ఆగ్నేసియా దేశాల నుంచి బౌద్ధ పర్యాటకులకు ఆకర్షించడం, సముద్రంలో క్రూయిజ్‌ల నిర్వహణ, యాటింగ్, సీప్లేన్, బీచ్‌లకు వచ్చే పర్యాటకుల సంఖ్య పెంచడం, వాటర్ స్పోర్ట్స్ హెల్త్, కల్చరల్ పర్యాటక రంగాలను ప్రోత్సహించాలని ప్రణాళికలు పొందుపరిచారు.

స్పీడ్‌బ్రేకర్లా? యమపాశాలా?

- ప్రామాణికతలు పాటించకపోవడంతో ప్రమాదకర పరిస్థితి
- ఆదర్శనగర్-తోటగరువు కూడలి మధ్య 10 స్పీడ్‌బ్రేకర్లు
- తరచూ రోడ్డు ప్రమాదాలకు గురవుతున్న వాహనదారులు
- లైట్లు వెలగకపోవడంతో రాత్రి వేళల్లో అధికంగా యాక్సిడెంట్లు


తోటగరువు స్కూలు సమీపంలో ఎత్తుగా వేసిన స్పీడ్‌బ్రేకర్లు

ఆరిలోవ, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఆరిలోవ, పరిసర ప్రాంతాల్లో రోడ్లపై వేసిన స్పీడ్ బ్రేకర్లు యమ పాశాలుగా మారాయని స్థానికులు, వాహన చోదకులు వాపోతున్నారు. కొన్ని ప్రాంతాల్లో స్పీడ్ బ్రేకర్ల వల్ల ప్రయోజనం కంటే ఇబ్బందులే ఎదురవుతున్నాయని అంటున్నారు. వాహనాల వేగ నియంత్రణ కోసం ఈ స్పీడ్ బ్రేకర్లను వేసినప్పటికీ కొన్ని జాగ్రత్తలు తీసుకోక పోవడంతో ఇవి ప్రమాదకరంగా మారుతున్నాయని చెబుతున్నారు.

తోటగరువు జిల్లా పరిషత్తు హైస్కూలు సమీపంలో నాలుగు స్పీడ్‌బ్రేకర్లు ఉన్నాయి. ఇవి బాగా ఎత్తుగా ఉండడంతో కారు బంపర్లకు తగులుతున్నాయి. ఈ రోడ్డులో ప్రయాణించేవారు నిర్లక్ష్యంగా ఉంటే ప్రమాదం కొనితెచ్చుకున్నట్టే. స్పీడ్ బ్రేకర్లు లేవనే ధీమాతో వాహనాన్ని వేగంగా వెళ్తే రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారు. ఎక్కువగా ద్విచక్ర వాహనదారులే బాధితులు అవుతున్నారు. స్పీడ్‌బ్రేకర్లకు తెలుపు రంగులు వేయకపోవడంతో అవి ఉన్నట్టు గుర్తించడం కష్టంగా మారుతోంది. రాత్రి వేళల్లో రోడ్డుపై ఉన్న లైట్లు వెలగకపోవడం కూడా సమస్యగా తయారైంది.

అలాగే ఆదర్శనగర్ కూడలి నుంచి తోటగరువు కూడలి మధ్య సుమారు 10 స్పీడ్ బ్రేకర్లు ఉన్నాయి. చినగదిలి నార్త్ షిర్డీ సాయిబాబా ఆలయం నుంచి ఆరిలోవ వైపు వెళ్లే సూర్యతేజనగర్ వద్ద కూడా అతి పెద్ద స్పీడ్ బ్రేకర్లు వేశారు. వీటిని ఏర్పాటు చేసేటప్పుడు కొన్ని ప్రామాణికాలు పాటించాల్సి ఉంటుంది. కానీ అవేవీ ఇక్కడ కనిపించవు. సాధారణంగా బీఆర్టీఎస్ రోడ్లు, జాతీయ రహదారులపై స్పీడ్‌బ్రేకర్లు వేయరు. ఇక్కడ మాత్రం నిబంధనలకు విరుద్ధంగా వేశారు. అయితే ఆ ప్రాంతంలో లైట్లు వెలగకపోవడంతో ఇబ్బందిగా మారింది. స్పీడ్‌బ్రేకర్లు వేసిన చోట ఎలాంటి మార్కింగ్ చేయలేదు. దీంతో చీకట్లో ఇవి కనిపించకపోవడంతో తరచూ వాహనదారులు రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారుల ఇబ్బందులు పడుతున్నారు. నెల రోజుల కిందట మోటార్ సైక్లిస్టు ఇక్కడ రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. అతడిని ఆస్పత్రికి తీసుకెళుతుండగా ప్రాణాలు పోయాడు. ఆ తరువాత కూడా ఇక్కడ పలు రోడ్డు ప్రమాదాలు సంభవించాయని, రాత్రి వేళలో చీకటిగా ఉండడంతో ఇక్కడ స్పీడ్ బ్రేకర్లు ఉన్న విషయాన్ని గమనించని వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారని స్థానికులు అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇక్కడ నిబంధనలకు విరుద్ధంగా వేసిన స్పీడ్‌బ్రేకర్ల తొలగించడం లేదా ఇక్కడ తెలుపు రంగుతో మార్కింగ్ చేయడం గాని చేయాలని కోరుతున్నారు.

ముస్లింలకు రాజకీయ ప్రాధాన్యం

- శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు


సమావేశంలో మాట్లాడుతున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు, వేదికపై రాష్ట్ర మంత్రి ఎన్ఎండీ ఫరూక్, ముస్లిం పెద్దలు

పెందుర్తి, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ముస్లింల సంక్షేమం, అభివృద్ధి, విద్య, ఉపాధి నైపుణ్య కల్పనకు కూటమి ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. నామినేటెడ్ పదవుల్లో మైనార్టీలకు రాజకీయ ప్రాధాన్యత ఇస్తామన్నారు. ఉమ్మడి విశాఖ జిల్లా నూర్‌బాషా దూదేకుల జనగర్జన మహాసభ శనివారం పెందుర్తిలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన అసెంబ్లీ స్పీకర్ అయ్యన్న పాత్రుడు ప్రసంగించారు. రాష్ట్ర ప్రభుత్వం దూదేకులకు అండగా ఉంటుందన్నారు. ముస్లిం యువతకు వృత్తి నైపుణ్యంలో శిక్షణ ఇచ్చి భవిష్యత్తులో ఔత్సాహిక వ్యాపార, పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు కార్యాచరణ ప్రణాళికను అమలు చేస్తుందన్నారు. ప్రభుత్వ చేయూతతో యువత, మహిళలు స్వయం ఉపాధితో ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని, వారు తయారు చేసే వస్తువులకు బ్రాండింగ్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. సృజన, నైపుణ్యతకు బ్రాండింగ్ తోడ్పాటైతే సత్ఫలితాలు వస్తాయన్నారు. మైనార్టీ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ మాట్లాడుతూ నూర్‌బాషాలు ఆత్మగౌరవాన్ని పరిరక్షించుకుంటూనే హక్కులు సాధించుకుని సమష్టిగా కార్యసాధకులు కావాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. రాజకీయ, ఇతర రంగాల్లో సముచిత స్థానం కల్పించేందుకు మంత్రిగా తన వంతు కృషి చేస్తానన్నారు. స్థానిక ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు మాట్లాడుతూ సంఘ ఐక్యతను చాటి చెప్పే ఇటువంటి బృహత్తర కార్యక్రమాలు ముస్లిం యువత భావితరాలకు స్ఫూర్తి అన్నారు.

పెందుర్తిలో భవనం ప్రారంభం

పెందుర్తిలోని ద్రోణంరాజునగర్‌లో నూతనంగా నిర్మించిన విశాఖ జిల్లా నూర్ బాషా, దూదేకుల నూతన భవనాన్ని స్పీకర్ అయ్యన్న, మంత్రి ఫరూక్ సంయుక్తంగా ప్రారంభించారు. అనంతరం సంఘం ఆధ్వర్యంలో ప్రముఖులందరికీ ఘనసన్మానం చేశారు. ఇస్లాంలో తారతమ్యాలు లేవని, అందరూ సమానమని ఉద్ఘాటించారు. ఉమ్మడి విశాఖ జిల్లా అధ్యక్షుడు షేక్ బాబ్జీ, ఆహ్వాన కమిటీ చైర్మన్ షేక్ ఖాన్‌సాహెబ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావు, యువజన ముస్లిం సంఘ ప్రతినిధి షేక్ షఫీ ఉల్లా ఫీర్ మహ్మద్, మస్తానమ్మ, ఎస్కే. సుభాన్, షేక్ రెహమాన్, దావూద్ అలీ, సలీమ్ ఖాసీం పాల్గొన్నారు.

ఆంధ్రా బాలుర కబడ్డీ జట్టు సెలక్షన్ కమిటీ చైర్మన్‌గా కనకరాజు



అగనంపూడి, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రా బాలుర కబడ్డీ జట్టు సెలక్షన్ కమిటీ చైర్మన్‌గా గాజువాకకు చెందిన ఉరుకూటి కనకరాజు నియమితులయ్యారు. ఈ మేరకు ఆంధ్ర కబడ్డీ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ యలమంచిలి శ్రీకాంత్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా రావులపాలెంలో ఆదివారం నుంచి ఈ నెల 25 వరకు జరగనున్న 50వ ఏపీ రాష్ట్ర బాలుర అంతర్ రాష్ట్ర కబడ్డీ చాంపియన్ పోటీలకు సెలక్షన్ కమిటీ చైర్మన్‌గా కనకరాజు వ్యవహరించనున్నారు. ఈ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఆంధ్రా జట్టుకు ఎంపిక చేస్తారు. రాష్ట్ర స్థాయి బాలుర కబడ్డీ జట్టు సెలక్షన్ కమిటీ చైర్మన్‌గా తనను నియమించడం పట్ల కనకరాజు ఆనందం వ్యక్తం చేశారు.

ఏమిటీ దురవస్థ!

చినుకు పడితే అధ్వానంగా ఎంవీపీ కాలనీ రహదారులు


ఏఎస్ రాజా కళాశాల ఎదురు బస్టాపు వద్ద నిలిచిన వర్షం నీరు

ఎంవీపీ కాలనీ, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : 'పేరు గొప్ప, ఊరు దిబ్బ' అన్న రీతిలో ఎంవీపీ కాలనీ కనిపిస్తుంది. అన్ని వసతులు, సౌకర్యాలు, పోష్ లోకాలిటీ, విద్యా సంస్థలు, వ్యాపార సంస్థలతో విరాజిల్లుతున్న ఈ కాలనీలో చిన్న చినుకు పడితే నరకయాతనే. భారీ వర్షాలు, గాలులు వీస్తే మరింత ఇబ్బంది. చెట్ల కొమ్మలు పడిపోయి, వాహనాలు దెబ్బతినడం, రహదారులు స్తంభించడం ఇక్కడ మామూలే. గత మూడు రోజులుగా కురుస్తున్న వానలకు రహదారులు దెబ్బతిన్నాయి. వీధి రోడ్ల గుంతలుగా మారాయి. ఎంవీపీ సర్కిల్ నుంచి టాస్క్ ఫోర్స్ సర్కిల్‌కు వెళ్లే రహదారిలో ఉన్న బస్టాపు వద్ద మురుగు నీటితో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఆ రహదారి వెంట నడవడానికి కూడా ఇబ్బందిగా తయారైంది పరిస్థితి. సాధారణ రోజుల్లో కూడా ఇక్కడ మురుగునీరు నిలిచి ఉంటుందని, బస్టాపు వద్దకు వచ్చిన ప్రయాణికులు అంటున్నారు. ఏళ్ల తరబడి ఇదే పరిస్థితి ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదని అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

ఘనంగా మాజీ సీఎం జగన్ జన్మదిన వేడుకలు


రక్తదానం చేస్తున్న మాజీ మంత్రి అమర్‌నాథ్, పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేశ్‌కుమార్, ఎమ్మెల్సీ కల్యాణి, కెకె రాజు తదితరులు

మద్దిలపాలెం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మద్దిలపాలెం వైసీపీ కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి జగన్ పుట్టినరోజు వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో మాజీ మంత్రి, వైసీపీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్ నాయకత్వంలో మళ్లీ మంచి రోజులు వస్తాయని నిరాశ చెందకుండా పని చేయాలన్నారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు, మేయర్ హరివెంకట కుమారి, ఎమ్మెల్సీలు వరుదు కల్యాణి, రవీంద్రబాబు, మాజీ ఎమ్మెల్యేలు తైనాల విజయకుమార్, మళ్ల విజయప్రసాద్, తిప్పల నాగిరెడ్డి, చింతలపూడి వెంక్రటామయ్య రాష్ట్ర కార్యదర్శి రవిరెడ్డి, కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

డా.కృష్ణవీర్ అభిషేక్ ప్రపంచ రికార్డు


అభిషేక్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

వెంకోజీపాలెం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : డాక్టర్ చల్లా కృష్ణవీర్ అభిషేక్, భాషావేత్త, డీన్ వాన్ లీవెన్ సెంటర్ ఫర్ పీస్ స్టడీస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, సాహిత్యానికి చేసిన సేవలకు గుర్తింపుగా ఛాంపియన్స్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్సు అందుకున్నారు తన అద్భుత సాహిత్య కృషికి గుర్తింపు పొందిన డాక్టర్ అభిషేక్ తెలుగు-ఇంగ్లీష్ క్రియోల్ పిడ్జిన్‌లో మొట్టమొదటి పుస్తకాన్ని రాశారు.దీన్ని ప్రముఖంగా తెంగ్లీస్ అని పిలుస్తారు. ఇది ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక, భాషా వైవిధ్యాన్ని ప్రతిబింబించే భాషల ప్రత్యేక సమ్మేళనం. డాక్టర్ కృష్ణవీర్ అభిషేక్‌ను ఏయూ ఆర్ట్ అండ్ కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎ.నరసింహారావు అభినందించారు. శనివారం ప్రిన్సిపాల్ ఆయన చాంబర్‌లో ఈ అవార్డును ప్రదానం చేశారు. డాక్టర్ అభిషేక్ మాట్లాడుతూ తన ప్రయాణంలో స్ఫూర్తి నింపిన చాంపియన్స్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్సుకు, మార్గదర్శకులకు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థుల సృజనాత్మకత అమోఘం

- ఏయూ వీసీ శశిభూషణరావు
- ఫైన్‌ఆర్ట్స్ ఫెయిర్-2024 ప్రారంభం

వెంకోజీపాలెం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) :ఫైన్ ఆర్ట్స్ విద్యార్థుల సృజనాత్మకత అమోఘమని ఏయూ వీసీ జి.శశిభూషణరావు అన్నారు.శనివారం శివాజీపాలెంలోని ఏయూ ఫైన్ ఆర్ట్స్ విభాగంలో నిర్వహించిన ఫైన్ ఆర్ట్స్ ఫెయిర్ -2024ను ఆయన ప్రారంభించారు. విద్యార్థులు రూపొందించిన కళాఖండాలు, అలంకరణ వస్తువులను తిలకించారు. విద్యార్థులప్రతిభను ప్రత్యేకంగా ప్రశంసించారు. అనంతరం వీసీ మాట్లాడుతూ త్వరలో ఏయూ శతాబ్ది ఉత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. ఈ ఉత్సవాలకు సంబంధించిన లోగో రూపకల్పనకు త్వరలో పోటీలు నిర్వహించనున్నట్టు తెలిపారు. దీనికి చిత్రకళా విభాగం ఆచార్యులు, విద్యార్థుల సహకారం ఎంతో అవసరమన్నారు. విద్యార్థులు నేర్చుకున్న అంశాలను ప్రదర్శిస్తూ, విశాఖ వాసులకు పరిచయం చేస్తూ ఏర్పాటు చేసిన ప్రదర్శన విజయవంతం కావాలన్నారు. ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఎ.నరసింహారావు మాట్లాడుతూ యువతలో నిరంతరం ఉద్భవించే వైవిధ్య ఆలోచనలకు రూపం కల్పించే వేదికగా చిత్రకళా విభాగం నిలుస్తోందన్నారు. ఈ ఫెయిర్‌లో కళారూపాలు, చిత్రాలు, శిల్పాలు, అలంకరణ వస్తువులు అత్యుత్తమ ప్రమాణాలతో ఉన్నాయన్నారు. విభాగాధిపతి డి.సింహాచలం మాట్లాడుతూ విద్యార్థుల ప్రతిభను ప్రదర్శించే వేదికగా ఈ కార్యక్రమాన్ని రూపొందించి నిర్వహిస్తున్నామన్నారు. ఈ నెల 29వ తేదీ వరకు ఈ ప్రదర్శన కొనసాగుతుందని తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు ప్రదర్శన ఉంటుందని, నగర వాసులు పెద్ద సంఖ్యలో ఈ ప్రదర్శన తిలకించాలని కోరారు. కార్యక్రమంలో పలువురు ఏయూ అధికారులు, ఆచార్యులు పాల్గొని నూతనంగా ప్రారంభించిన విద్యార్థుల ప్రత్యేక సంచిక కాన్వాస్‌ను ఆవిష్కరించారు.


ప్రదర్శనలో ఆకృతులను చూస్తున్న వీసీ శశిభూషణరావు, ఆచార్యులు నరసింహారావు, సింహాచలం తదితరులు

ధ్యానం ప్రాధాన్యంపై అవగాహన సదస్సు

వెంకోజీపాలెం, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి) : ఏయూ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ స్టడీస్ ఇన్ ఎడ్యుకేషన్ (ఐఏఎస్ఈ) ప్రాంగణంలో శనివారం ప్రపంచ ధ్యాన దినోత్సవం సందర్భంగా అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. హార్ట్ ఫుల్ నెస్ సేవా సంస్థకు సంబంధించిన వలంటీర్లు పి.గాయత్రి, కె.లలిత నిత్య జీవితంలో ధ్యానం ప్రాధాన్యం గురించి వివరించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ నగరాజకుమారి మాట్లాడుతూ మెడిటేషన్ విద్యార్థుల్లో కలిగే మానసిక, శారీరక ఒత్తిళ్లను దూరం చేయడంలో బాగా ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఇతర అధ్యాపక బృందం కూడా పాల్గొన్నారు.

☛ సంక్షిప్తంగా..

చందన అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి


చందన అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చిన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి

ఎంవీపీ కాలనీ, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఎంవీపీ కాలనీ ఆరో సెక్టరు శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయం ఆవరణలో కొలువైన శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. చందన అలంకరణలో మెరిసిపోతున్న స్వామిని భక్తులు దర్శించుకున్నారు. పూజానంతరం ప్రసాద వితరణ నిర్వహించారు.

డిప్యూటీ సీఎం పవన్‌ను కలిసిన ఎమ్మెల్యే వంశీకృష్ణ


పవన్‌ను కలిసిన దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ

మద్దిలపాలెం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఉత్తరాంధ్ర పర్యటనలో భాగంగా నగరానికి వచ్చిన ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌ను శనివారం జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే వంశీకృష్ణశ్రీనివాస్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పార్టీ, పాలనకు సంబంధించిన పలు అంశాలు ఆయనతో చర్చించారు. కార్యక్రమంలో జనసేన పార్టీ ఎమ్మెల్యేలు, నాయకులు పాల్గొన్నారు.

మంత్రి ఫరూక్‌తో నజీర్ భేటీ



రామ్‌నగర్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్‌ను టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహ్మద్ నజీర్ మర్యాద పూర్వకంగా కలిశారు. శనివారం విశాఖ జిల్లా పర్యటకు విచ్చేసిన మంత్రి ఫరూఖ్‌తో గవర్నర్ బంగ్లాలో నజీర్ కలిసి శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందించారు. జిల్లాలో ముస్లింల సమస్యలతో పాటు పలు అంశాలపై చర్చించారు.

సినిమా గైడ్

● **బచ్చలమల్లి :** సంగం, రమాదేవి, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-1 (104ఏరియా), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య-2 (గాజువాక), తాతా (తగరపువలస)
● **విడుదల-2 :** శ్రీకన్య వెంకటేశ్వర, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), మినీ మోహిని (గాజువాక), శ్రీరాములమ్మ (తగరపువలస)
● **యుఐ :** శారద, శ్రీనరసింహ (గోపాలపట్నం), హెవెన్ (గాజువాక)
● **ముఫాసా :** జగదాంబ, శ్రీరామ, శ్రీవెంకటేశ్వర, కామేశ్వరి, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), శ్రీకన్య, మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), నటరాజ్-2 (పెందుర్తి), గణేష్ (తగరపువలస)
● **పుష్ప-2 :** మెలోడి, శరత్, ఊర్వశి (కంచరపాలెం), సౌజన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-1 (పెందుర్తి), సప్తగిరి (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 32, టమాటా 20, వంకాయలు (తెలుపు)38, వంకాయలు (నలుపు) 48, బెండకాయలు 40, పచ్చిమిర్చి 32, కాకరకాయలు 42, బీరకాయలు 48, ఆనపకాయ 20, కాలీఫ్లవర్ 16, క్యాబేజి 24, క్యారెట్ 36 దొండకాయలు 44, బంగాళ దుంపలు 30, అరటికాయ (పె)6, మునక్కాడలు (కిలో) 140, అల్లం (పాతది) 56, బరబాటి 42, ముల్లంగి 18, నిమ్మకాయలు (కిలో) 60, గోరుచిక్కుడు 30 దోస కాయలు 28, వెల్లుల్లి (పెద్దవి) 340, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 60, పొటల్స్ 56, కీరదోస 36, కాప్సికమ్ 56, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 30, చిలగడదుంపలు 34, కంద 64, దేముడు చిక్కుడు 38, కొండఉసిరి 55, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్ద కట్ట) 35, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 100, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 28, మామిడి అల్లం 64, బొప్పాయి 40, జామకాయలు (కిలో) 45.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	590
విజయనగరం	594
శ్రీకాకుళం	594

చికెన్ ధరలు	
బ్రాయిలర్	
రైతు ధర	90
ఫారం ధర	110
విత్ స్కిన్	190
స్కిన్‌లెస్	200


పోస్టర్ ఆవిష్కరిస్తున్న రవీంద్ర, ఎస్వీఎస్ ప్రకాశ్‌రెడ్డి తదితరులు

'వీర్ బాల్ దివస్' పోస్టర్ ఆవిష్కరణ

నేటి నుంచి 26వ తేదీ వరకు స్కూళ్లలో కార్యక్రమ నిర్వహణ

పెదవాల్తేరు, డిసెంబరు 21 : కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 22 నుంచి 26వ తేదీ వరకు గ్రామ, పట్టణ స్థాయిలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలోనూ వీర్ బాల్ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించాలని బీజేపీ విశాఖపట్నం పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర తెలిపారు. శనివారం బీజేపీ నగర కార్యాలయంలో ఉత్తరాంధ్ర వీర్ బాల్ దివస్ కార్యక్రమ కో-ఆర్డినేటర్ ఎస్వీఎస్ ప్రకాశ్‌రెడ్డితో కలిసి ఆయన ఈ కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రవీంద్ర మాట్లాడుతూ గుర్‌ద్వార్‌లో సామూహిక శబద్ కార్యక్రమాలు, కీర్తనలు ఆలపించాలని, పాఠశాలలు, కళాశాలల్లో క్విజ్ పోటీలు నిర్వహించాలని, జిల్లా స్థాయిలో మేధావులు సదస్సులను నిర్వహించి, దేశం కోసం ఆత్మ త్యాగం చేసిన అమరవీరులు గురించి నేటి యువతరానికి తెలియజేయాలని కోరారు. ఇందుకోసం జిల్లా యంత్రాంగం ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వీర్ బాల్ దివస్ సమన్వయకర్తలు రూపాకుల రవికుమార్, శ్రీరంగం ధనేశ్వరరావు, బొడ్డేటి రవికుమార్, బీజేపీ శ్రీకాకుళం జిల్లా ఇన్‌చార్జి ఎస్.విజయంద్రరెడ్డి, టి.సుబ్బరామిరెడ్డి పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో 478 మంది ఎంపిక


ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులతో కృష్ణ కళాశాల అధ్యాపకులు, నిర్వాహకులు

మద్దిలపాలెం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం జేకేసీ, సూర్య ఇన్ఫోటెక్ తదితర కంపెనీలు నిర్వహించిన జాబ్‌మేళాలో 478 మంది అభ్యర్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఉదయం 9.30 గంటలకు రిజిస్ట్రేషన్లు చేసుకున్న విద్యార్థులకు సంస్థలు ఇంటర్వ్యూలు నిర్వహించి తమకు అవసరమైన వారిని ఎంపిక చేసుకున్నాయి. టాటా గ్రూపులో 158 మంది, హోండా 81, ఫాక్స్ కాన్ 120, అపోలో ఫార్మసీ 15, అరబిందో 16, ఫ్లిఫ్‌కార్ట్ 18, యంగ్ ఇండియా 15, ఎస్‌బీఐ కార్డ్స్ 5, ఏఆర్‌కే సొల్యూషన్స్ 5, సాఫ్ట్ సొల్యూషన్స్ 8, అభిరామ్ ఐటీ సొల్యూషన్స్‌లో 36 మందికి ఉద్యోగాలు కల్పించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ విజయబాబు మాట్లాడుతూ డిగ్రీ పూర్తి చేసిన అభ్యర్థులకు ఉద్యోగాలు కల్పించడానికి తమ కళాశాలలో జాబ్‌మేళాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. జాబ్‌మేళాల్లో కంపెనీలు ఎంపిక చేసుకునే విధంగా కమ్యూనికేషన్ స్కిల్స్‌లో శిక్షణ అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో పలు సంస్థల హెచ్‌ఆర్‌లు, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సంప్రదాయబద్ధంగా ధనుర్మాస పూజలు


హరికథను వినిపిస్తున్న ఆచారి భాగవతార్


వెంకోజీపాలెం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా శనివారం సాయంత్రం ఎంఎంటీసీ త్రిమూర్తిక వేంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్వహించిన హరికథ ఆహూతులను అలరించింది. ఆచారి భాగవతార్ హరికథను గానం చేశారు. ఉదయం స్వామివారికి తులసి మాలలతో అలంకరించారు. ఆలయ అర్చకుడు వెంకటరమణాచార్యులు, గోపాలకృష్ణ, వంశీకృష్ణమాచార్యులు భక్తుల గోత్రనామాలతో ప్రత్యేక అభిషేకాలు చేశారు. గోవింద నామంతో ఆలయమంతా మార్మోగింది. కార్యక్రమంలో ఆలయ కార్యదర్శి ఎం.సావిత్రి, కోశాధికారి కె.సుబ్బారాయుడు, మేనేజరు బి.సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

అలాగే కొత్త వెంకోజీపాలెంలోని రామాలయంలో వేంచేసి ఉన్న వైభవ వెంకటేశ్వరస్వామి ఆలయంలో ధనుర్మాస ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు కిషోర్ శర్మ భక్తుల గోత్ర నామాలతో అభిషేకాలు జరిపారు.

డీసీసీబీ పర్సన్ ఇన్‌చార్జిగా జేసీ పదవీకాలం పొడిగింపు

విశాఖపట్నం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ (డీసీసీబీ) అఫీషియల్ పర్సన్ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్న జాయింట్ కలెక్టర్ పదవీకాలాన్ని మరో ఆరు నెలలు పొడిగించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గత ప్రభుత్వం నియమించిన నామినేటెడ్ పర్సన్ ఇన్‌చార్జిలను తొలగించి జాయింట్ కలెక్టర్లకు ఆ బాధ్యతలను అప్పగించారు. జూన్‌లో ఇచ్చిన ఆదేశాలు ఈ నెల 26తో ముగియనున్నందున ఈ నెల 27వ తేదీ నుంచి ఆరు నెలల పాటు అఫీషియల్ పర్సన్ ఇన్‌చార్జిగా జేసీ కొనసాగుతారని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

మానవాళిని దైవత్వం వైపు నడిపేదే కృష్ణతత్వం


ప్రవచనాలు చెబుతున్న సుశీలాజీ

సిరిపురం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మానవాళి దృష్టిని దైవత్వం వైపు నడిపేందుకు శ్రీకృష్ణుడు వివిధ రూపాల్లో అవతారమెత్తారని ఆధ్యాత్మిక గురువు సుశీలాజీ పేర్కొన్నారు. శనివారం వేదాంత ఇన్‌స్టిట్యూట్ (విశాఖపట్నం) ఆధ్వర్యంలో జరిగిన ఆధ్యాత్మిక ప్రవచనంలో ఆమె భగవద్గీతలో 10వ అధ్యాయంలోని విభూతియోగంపై ప్రసంగించారు. ఎక్కువ పరిణితి చెందిన వ్యక్తులకు చిన్న విషయాల్లో కూడా భగవంతుని అనుభూతి లభిస్తుందన్నారు. అనంతరం నిర్వహించిన భజనలో పాల్గొని కీర్తనలు ఆలపించారు. కార్యక్రమంలో సభ్యులు, ఆధ్యాత్మికవేత్తలు, ప్రజలు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న శ్రీకృష్ణ పారిజాతం


నృత్య రూపంలో ఓ రసవత్తర సన్నివేశం

మద్దిలపాలెం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : పిఠాపురం కాలనీ కళాభారతి ఆడిటోరియంలో శనివారం ప్రదర్శించిన శ్రీకృష్ణ పారిజాతం కూచిపూడి నృత్య రూపకం ఆకట్టుకుంది. కృష్ణుడు, రుక్మిణి, సత్యభామల మధ్య జరిగిన చక్కని ప్రేమ, అసూయ, భక్తితత్వాల మధ్య సాగిన ఘట్టాలను కళాకారులు చక్కని హావభావాలతో ప్రదర్శించారు. కృతిస్వాతి, నిఖిత, రూప, హంసిత, మనస్విలు అద్భుత ముఖకదలికలతో కూచిపూడి నృత్యాలు ప్రదర్శించి అందరి మన్నలు పొందారు. పారిజాత పుష్పంతో శ్రీకృష్ణుడు, రాధ, సత్యభామల మధ్య నారదుడు పెట్టిన కలహం, అతివల మధ్య అసూయ, కృష్ణుడు జయించిన తీరును నృత్యరూపకంలో ఆకట్టుకునేలా ప్రదర్శించారు. కార్యక్రమంలో కళాభారతి కార్యదర్శి జి.రాంబాబు, డాక్టర్ మధుకుమార్, బాలకొండలరావు, శ్యామల, ఇందిరజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు


మహిళలకు చీరలు అందజేస్తున్న సీతంరాజు సుధాకర్, ఇతర అతిథులు

అల్లిపురం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 33వ వార్డు సాయిబాబా వీధిలో శనివారం విల్లూరి చిన్నతల్లి చారిటబుల్ ట్రస్ట్ విల్లూరి చక్రవర్తి, తిరుమాలదేవి ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎన్టీఆర్ ఆరోగ్యశ్రీ ఛైర్మన్, దక్షిణ టీడీపీ ఇన్‌చార్జ్ సీతంరాజు సుదాకర్ హజరై క్రీస్తు మానవాళికి చేసిన మేలును వివరించారు. అనంతరం అతిథుల చేతులమీదుగా 300 మంది మహిళలకు చీరలు అందజేశారు. పాస్టర్ కుమార్, దాసన సత్యనారాయణ, డీవీఎస్‌కే వరప్రసాద్, బీశెట్టి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పవన్‌ను కలిసిన ఎమ్మెల్యే



డాబాగార్డెన్స్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర జిల్లాల పర్యటనకు విచ్చేసిన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్‌కల్యాణ్‌ను దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. దక్షిణ నియోజకవర్గ అభివృద్ధితో పాటు పలు అంశాలపై చర్చించారు.

బాబోయ్..గుంతలు


నక్కవానిపాలెం అరవై అడుగుల రోడ్డు ఇలా..

సీతమ్మధార, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ విశాఖ 24వ వార్డులోని నక్కవానిపాలెం 60 అడుగుల రోడ్డు గుంతలమయంగా మారింది. కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షం వలన ఆ రహదారిలో ప్రయాణం ఇబ్బందికరంగా మారింది. అటుగా ప్రయాణించే ద్విచక్రవాహనదారులు గోతులో వాహనాలు దిగినపుడు పడిపోయే ప్రమాదకర పరిస్థితి నెలకొంది. రోడ్డులోని గుంతల్లో వర్షపు నీరు నిలిచిపోవడంతో అటుగా ప్రయాణించే వారంతా ఇబ్బందులు పడుతున్నారు.

పూర్వ విద్యార్థినుల సమ్మేళనం


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న డాక్టర్ కె.లక్ష్మీరావు

జ్ఞానాపురం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక సెయింట్ జోసెఫ్ కళాశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థినులు 200 మంది సమ్మేళనం నిర్వహించారు. వారి హోదాలు మరిచి ఆటపాటలతో సందడి చేశారు. ఏటా డిసెంబరు మూడో శనివారం ఈ కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. పూర్వ విద్యార్థిని, హైదరాబాద్ సెంటర్ ఫర్ ప్రొఫెషనల్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ డాక్టర్ కె.లక్ష్మీరావు విచ్చేసి జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. కళాశాలతో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. పూర్వ అధ్యాపకులను ఘనంగా సన్మానించారు. ప్రిన్సిపాల్ డా.సిస్టర్ షైజీ, డా. మంగవేణి, డా.వై.లక్ష్మీప్రభ, డా.పి.కె.జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్లు మంజూరు చేయండి

మురళీనగర్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): విశాఖ ఉత్తర నియోజకవర్గంలో సొంతింటికి నోచుకోని పేద ప్రజలకు సొంత గూడు మంజూరు చేయాలని మురళీనగర్ 280వ సచివాలయం వద్ద శనివారం జరిగిన రెవెన్యూ సదస్సులో టీడీపీ పార్లమెంటరీ అధికార ప్రతినిధి సనపల వరప్రసాద్ గోపాలపట్నం అర్బన్ తహసీల్దారు రమేష్‌కి విజ్ఞప్తి చేశారు. మాధవధార 9/2, 9/6 సర్వే నంబర్‌లోని ప్రజలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలన్నారు. సాయిరాంనగర్ కాలనీ వాసులకు తారు రోడ్డు సౌకర్యం కల్పించాలని కోరారు. తగిన చర్యలు తీసుకుంటామని తహసీల్దారు రమేష్ అన్నారు. కార్యక్రమంలో 49వవార్డు నాయకులు లోలాచి, మురళి, నారాయణరావు హాజరయ్యారు.

మహిళలకు చీరల పంపిణీ

అక్కయ్యపాలెం/సీతమ్మధార, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి జన్మదినం సందర్భంగా 44వ వార్డు కార్పొరేటర్ బానాల శ్రీనివాసరావు నందగిరినగర్‌లోని కార్యాలయంలో శనివారం మహిళలకు చీరలు పంపిణీ చేశారు. కేకు కోసి కార్యకర్తలకు, నాయకులకు తినిపించారు. నాయకులు గోపి, బానాల తరుణ్‌కుమార్ పాల్గొన్నారు. కైలాసపురం జంక్షన్‌లో డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్ ఆధ్వర్యంలో ఉత్తర నియోజకవర్గం వైసీపీ ఇన్‌చార్జ్ కేకే రాజు కేక్ కట్ చేశారు. పాపా హోమ్‌లో పిల్లలకు అల్పాహారం, రాతపుస్తకాలను 14వ వార్డు కార్పొరేటర్ అనిల్‌కుమార్ రాజు, ఉత్తర నియోజకవర్గం సమన్వయకర్త కేకే రాజు పంపిణీ చేశారు. 24వ వార్డులో కార్పొరేటర్ సాడి పద్మారెడ్డి ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు.

విన్యాసాల నిర్వహణలో సమన్వయం అవసరం: కలెక్టర్


బీచ్‌రోడ్డులో నావికాదళ అధికారులతో కలిసి కలెక్టర్ పరిశీలనలు

మహారాణిపేట, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): జనవరి 4న జరగనున్న నావికాదళ విన్యాసాల ను సమన్వయంతో వ్యవహరించి విజయవంతం చేయాలని కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ సూచించారు. శనివారం ఇండియన్ నేవీ, వీఎంఆర్‌డీఏ, జీవీఎంసీ కమిషనర్‌లతో కలిసి బీచ్ పరిసర ప్రాంతాల్లో పర్యటించి సమీక్షించారు విన్యాసాలకు సంబంధించి నేవీ అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రధాన వేదిక నిర్మాణం, లేజర్ షో, బాణసంచా, డ్రోన్ షో నిర్వహణ తదితర వాటిపై సమీక్షించారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, పలువురు మంత్రులు, ఉన్నతాధికారులు సందర్శించనున్న నేపథ్యంలో పటిష్ట భద్రతా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సాధారణ ప్రజలకు ఇబ్బంది లేకుండా బారికేడ్లు, ఎల్‌ఈడీ స్ర్కీన్లు, పార్కింగ్ ఏర్పాటు చేయాలని సూచించారు. వీఐపీ సిటింగ్ పాస్‌ల జారీ ప్రక్రియ జాగ్రత్తగా నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్లు పి.సంపత్ కుమార్, కె.ఎస్. విశ్వనాథన్, నావికాదళ అధికారులు పాల్గొన్నారు.

కర్మచారి కార్మికులకు ఆసరాగా నిలవండి

సఫాయి కర్మచారి కార్మికులకు చట్ట ప్రకారం కనీస వేతనాలు చెల్లించాలని జాతీయ సఫాయి కర్మచారి కమీషన్ సభ్యులు డాక్టర్ పీపీ వావా అన్నారు. శనివారం కలెకరేట్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వీరి సామాజిక, ఆర్థిక, విద్యా స్థితిగతులను అధ్యయనం చేసి సమాజంలో గౌరవంగా జీవించే అవకాశం కల్పించాలని సూచించారు. ఎలాంటి షూరిటీ అవసరం లేని బ్యాంకు రుణాలు అందించాలని కోరారు విధివశాత్తు మరణించినప్పుడు కుటుంబ సభ్యులకు ఉద్యోగం ఇవ్వాలన్నారు. గుర్తింపు కార్డులు ఇచ్చి ప్రభుత్వ ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. ఈ సమావేశంలో కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్, జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

కేజీహెచ్‌లో ఇకపై రాత్రి వేళ తనిఖీలు


కేజీహెచ్‌లో శుక్రవారం రాత్రి పర్యవేక్షిస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద్

మహారాణిపేట, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): కేజీహెచ్‌లో రోగులకు మెరుగైన సేవలందించటానికి రాత్రి సమయంలో విధుల పర్యవేక్షణను ప్రారంభించారు. శుక్రవారం రాత్రి గైనిక్, పిల్లల వార్డులతో ఇందుకు శ్రీకారం చుట్టి లోపాలను గుర్తించారు. రాత్రి సమయంలో ఆసుపత్రిలో రోగులను చేర్చుకునేందుకు అత్యవసర ప్రవేశాల కోసం కేస్ షీట్‌కు ప్రత్యేకంగా వెళ్లనవసరం లేకుండా కార్డియాలజీ విభాగంలో ఏర్పాట్లు చేసినట్లు సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద్ తెలిపారు. రోగి ఆధార్ కార్డు ఇస్తే కేసు షీట్‌ను తక్షణమే అందిస్తారని పేర్కొన్నారు. రాత్రి వేళ తక్షణ నిర్ణయాలు తీసుకుని రోగులకు మెరుగైన సేవలు అందించేలా ఇకపై రోజూ సూపరింటెండెంట్, డిప్యూటీ సూపరింటెండెంట్లు, చీఫ్ మెడికల్ రెసిడెంట్ ఆఫీసర్లు పర్యవేక్షిస్తారని ప్రకటించారు.

వైద్యవిద్యా కోర్సులపై సమీక్ష


సమావేశంలో పాల్గొన్న వైద్య ప్రముఖులు

మహారాణిపేట, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఎంబీబీఎస్ తరువాత చదివే వివిధ కోర్సులు, ఇతర అనుబంధ కోర్సుల నిర్వహణపై ఆంధ్ర వైద్య కళాశాలలో శనివారం సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో నేషనల్ బోర్డు ఆఫ్ ఎగ్జామినేషన్స్ వైస్ ఛైర్మన్ డాక్టర్ మినూ బాజ్‌పేయ్, ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం వీసీ డీఎస్‌వీఎల్ నరసింహం ఆధ్వర్యంలో సమీక్షించారు. ఉన్నత విద్య అభ్యసించాలనుకునే ఆశావహ వైద్యులకు అవసరమైన మార్గదర్శకాలను సూచించారు. ఈ సమావేశంలో ప్రముఖులు డాక్టర్ బాలరాజు, డాక్టర్ తిరుమల ప్రసాద్, కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్, డాక్టర్ రాజేంద్ర ప్రసాద్, డాక్టర్ మన్మధరావు పాల్గొన్నారు.

ఫ్లాట్ల రేట్లూ సవరణ

... 5వ పేజీ తరువాయి

రూ.5,100 చేశారు. అక్కడ మార్కెట్ రేటు రూ.6,300.

● అబిద్‌నగర్, అక్కయ్యపాలెం 80 అడుగుల రోడ్డులో ప్రస్తుతం రూ.5,500 ఉండగా రూ.5,600 చేశారు. అక్కడ మార్కెట్ విలువ రూ.7,800 ఉంది.

● సీతమ్మధార, పీ అండ్ టీ కాలనీ, బాలయ్య శాస్త్రి లేఅవుట్‌లలో రూ.5,700 ఉండగా రూ.5,900 చేశారు. అక్కడ మార్కెట్ విలువ రూ.8,200 ఉంది.

● నాయుడుతోట, దుర్గానగర్, కృష్ణానగర్‌లలో చ.అడుగు రూ.2,600 ఉండగా రూ.2,900 చేశారు. అక్కడ మార్కెట్ విలువ రూ.4,900గా ఉంది.

● ప్రహ్లాదపురం కాలనీలో రూ.3,200 ఉండగా రూ.3,600 చేశారు. మార్కెట్ రేటు రూ.6 వేలు ఉంది.

● లా కాలేజీ రోడ్డు, ఎంవీవీ సిటీలో చ.అడుగు రూ.4 వేలు ఉండగా రూ.4,200 చేశారు. మార్కెట్ రేటు రూ.7 వేలు ఉంది.

● కొమ్మాది జంక్షన్‌లో రూ.4,500 ఉండగా దానిని రూ.200 పెంచి రూ.4,700 చేశారు. అక్కడ మార్కెట్ రేటు రూ.6 వేలు ఉంది.

● సాయిప్రియా లేఅవుట్‌లో రూ.3,500 ఉండగా 200 పెంచి రూ.3,700 చేశారు. అక్కడ మార్కెట్ విలువ రూ.6 వేలు ఉంది.

● రుషికొండ వుడా లేఅవుట్‌లో రూ.3,500 ఉండగా రూ.3,800 చేశారు. అక్కడ మార్కెట్ రేటు రూ.5,500 ఉంది.

● ఎండాడలో రూ.3,500 ఉండగా రూ.300 పెంచి రూ.3,800 చేశారు. అక్కడ మార్కెట్ రేటు రూ.5,500 ఉంది.

● ఇండియా బుల్స్, ఐటీ పార్కు, స్కై లైన్, స్కై పార్క్, ఎంకే గోల్డ్, ఎంకే కోస్టు తదితర అపార్ట్‌మెంట్లలో చ.అడుగు ధర రూ.4 వేలు ఉండగా దానిని రూ.4,200 చేశారు. మార్కెట్ రేటు రూ.7 వేలు ఉంది.

● ఎం.వి.పి.కాలనీలో చ.అడుగు రూ.4,500 ఉండగా దానిని రూ.5,300 చేశారు.

● లాసన్స్ బే కాలనీలో రూ.5 వేలు ఉండగా రూ.5,300 చేశారు.

'రైలు ప్రయాణికులకు సేవలు మెరుగుపరచాలి'


రైల్వేస్టేషన్‌లో సలహాదారుల కమిటీ సభ్యులు

విశాఖపట్నం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): రైల్వే వినియోగదారులకు అందిస్తున్న సేవలు, నాణ్యతకు సంబంధించి స్టేషన్ సలహాదారుల కమిటీ సమావేశమై శనివారం రైల్వేస్టేషన్‌లో పరిశీలించింది. వివిధ శాఖల అధికారులతో పలు అంశాలపై చర్చించింది. ప్రయాణికుల సౌకర్యాలు, ఆహార సేవలు, ఆహార నాణ్యత మెరుగు పరచాలని సూచించింది. స్టేషన్ అభివృద్ధి ప్రాజెక్టుల వివరాలు తెలుసుకుంది. ప్రయాణికులకు మరిన్ని సౌకర్యాలు, ఉత్తమ సేవలందించేందుకు రైల్వే అధికారులు చేపడుతున్న కార్యనిర్వాహక చర్యలపై సంతృప్తి వ్యక్తం చేసింది. ప్రయాణికులకు తియ్యని అనుభవాలు అందించే దిశగా దృష్టి సారించాలని సూచించింది. ఈ సమావేశంలో స్టేషన్ సలహాదారుల కమిటీ సభ్యులు, రాజకీయ, వాణిజ్య, విద్యాసంస్థలు, ఎన్జీవో వంటి వివిధ రంగాలకు చెందిన డాక్టర్ కందుల నాగరాజు, పీవీఎస్‌కె.సురేష్, డేనియల్ జోసఫ్, కె.విజయ్‌మోహన్, పల్లా అప్పలకొండ, తోటపల్లి శ్రీనివాసరావు, ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.

'వస్తే తరిమి కొడతాం'


పోర్టు ఆసుపత్రి ఎదుట నాయకుల దీక్ష

అక్కయ్యపాలెం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): పోర్టు ఆసుపత్రి టెండర్‌కు ఎవరు వచ్చినా కాళ్లు పెట్టనీయకుండా తరిమి కొడతామని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింగరావు హెచ్చరించారు. పోర్టు ఆసుపత్రిని ప్రైవేటీకరించవద్దని చేస్తున్న నిరసన దీక్షలు శనివారం వర్షాన్ని సైతం లెక్క చేయకుండా 82వ రోజు చేపట్టారు. ఈ సందర్భంగా నరసింగరావు మాట్లాడుతూ పోర్టు ఆసుపత్రి టెండర్‌కు వచ్చిన వారిని అడ్డుకుని తరిమి కొట్టాలని పిలుపునిచ్చారు. ప్రైవేటీకరణ నిర్ణయం అనైతికమని, కార్మికుల కృషితోనే ఆసుపత్రి అభివృద్ధి సాధ్యమైందన్నారు. సుమారు 40 వేల మంది కార్మికుల ఆరోగ్యానికి సంబంధించిన సేవలను ప్రైవేటు వారికి అప్పగించడం అన్యాయమన్నారు. విశాఖ అభివృద్ధికి పోర్టు కీలకమైందని, కేంద్రంలో మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రభుత్వరంగ సంస్థల అమ్మకాన్నే విధిగా పెట్టుకుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వీఎస్ పద్మనాభరాజు, కె.సత్యనారాయణ, జక్కన సత్యనారాయణ, శంకరరావు, సీహెచ్ త్రినాథరావు, కేఎస్ కుమార్, రాఘవులు, రాము, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

అమిత్ షా బర్తరఫ్‌కు డిమాండ్



డాబాగార్డెన్స్‌లో అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న విదసం సభ్యులు

డాబాగార్డెన్స్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్‌లో డా.బి.ఆర్.అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్రమంత్రి అమిత్‌షాను తక్షణమే మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలని విదసం ఐక్యవేదిక రాష్ట్ర కన్వీనర్ బూసి వెంకటరావు డిమాండ్ చేశారు. శనివారం డాబాగార్డెన్స్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద విదసం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమిత్‌షా కర్మఫలంతో స్వర్గానికి చేరతారో, నరకానికి చేరతారో కానీ అంబేడ్కర్ రాసిన రాజ్యాంగం లేకుంటే హోంమంత్రి కాగలిగేవారా? అని ప్రశ్నించారు. అమిత్ షా వ్యాఖ్యలపై రాష్ట్రపతి సుమోటోగా స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాజేంద్రప్రాద్, అప్పారావు, దుర్గారావు, నూకరాజు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి: హర్షవల్లి

అక్కయ్యపాలెం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 45వ వార్డు సత్యసాయి నగర్ సమీపంలోని ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ ఆవరణలో సాయి సరిగమప సంస్థ వ్యవస్థాపక అధ్యక్షురాలు కె.హర్షవల్లి ఆధ్వర్యంలో శనివారం మొక్కలు నాటారు. ఆమె మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. ప్రస్తుతం నగరం కాలుష్యంతో కొట్టుమిట్టాడుతోందని, దాన్ని అరికట్టాలంటే వివిధ రకాల మొక్కలు నాటాలన్నారు. తమ సంస్థ పదేళ్లుగా పర్యావరణ పరిరక్షణను కాంక్షిసూ మొక్కలు నాటుతున్నట్లు చెప్పారు. భిన్నత్వంలో ఏకత్వం, భారతీయ సంస్కృతి సంప్రదాయాలపై గౌరవంతో సనాతన ధర్మ పరిరక్షణ కోసం తమ వంతు కృషి చేయాలన్న సంకల్పంతోనే ఇలా చేస్తున్నామన్నారు. చామంతి, బంతి, తులసి, మందారం, లిల్లీ, కనకాంబరం తదితర పూల మొక్కలు నాటామన్నారు. సంస్థ సభ్యులు నిర్మల, అవినాశ్, కనకయ్య, ప్రశాంతి పాల్గొన్నారు.

పేదలకు ఉచిత వైద్యం అందించాలి

ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు

విశాఖపట్నం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : సీతమ్మధార నార్త్ ఎక్స్‌టెన్షన్‌లోని ఎస్‌ఆర్‌ఐ ఆస్పత్రిలో పేదలకు ఉచిత వైద్యం చేయడం లేదని, నిబంధనలు పాటించడం లేదని ఉత్తర ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు ఆరోపించారు. శనివారం ఆయన కలెక్టర్‌కు లేఖ రాశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీతమ్మధార నార్త్ ఎక్స్‌టెన్షన్ లేఅవుట్‌ను వుడా వేసిందని, అందులో సామాజిక ప్రయోజనాల కోసం కేటాయించిన భూమిలో 4,372 గజాలను గజం రూ. 270 చొప్పున తక్కువ ధరకు 1990లో ఆస్పత్రి నిర్మాణం కోసం ఎస్‌ఆర్‌ఐ వైద్యులకు కేటాయించిందన్నారు.వుడా చేసిన అమ్మకం ఒప్పందం ప్రకారం ఆస్పత్రిలో 10 నుంచి 20 శాతం వరకు పేద రోగులకు ఉచిత వైద్యం చేయాలని, గదులు కేటాయించాలని ఉందన్నారు. కానీ యాజమాన్యం ఆస్పత్రిని మూడు నెలలు క్రితం కిమ్స్ మేనేజ్‌మెంట్‌కు విక్రయించిందన్నారు. అందులో 300 పడకలు ఉన్నాయని, నిబంధనల ప్రకారం 45 నుంచి 60 పడకలు పేదలకు కేటాయించి ఉచిత వైద్యం చేయాల్సి ఉందన్నారు. కానీ కొత్త యాజమాన్యం దీన్ని అమలు చేయడం లేదని, పైగా భారీ ఫీజులు వసూలు చేస్తున్నారని చెప్పారు. వుడా సేల్ డీడ్ ప్రకారం పేదలకు ఉచిత వైద్య సేవలు అందించేలా కిమ్స్ యాజమాన్యాన్ని ఆదేశించాలని కోరారు. నాడు ఆ భూమిని వారు రూ. 11.84,440 లక్షలకు కొనుగోలు చేశారని, ఇప్పుడు దాని విలువ రూ.85 కోట్లు ఉంటుందన్నారు.

ఐదేళ్లలో అభివృద్ధికి ప్రణాళిక

... 5వ పేజీ తరువాయి

విస్తీర్ణం చాలా తక్కువ. రాష్ట్ర స్థాయిలో విశాఖ జిల్లా చివరి స్థానం (26)లో నిలిచింది. వ్యవసాయ రంగం ద్వారా 2022-23లో వచ్చిన ఆదాయం రూ.3,569 కోట్లు. దీనిని ఏటా 10.95 శాతం వృద్ధితో 2028-29కల్లా రూ.6,348 కోట్లకు పెంచాలని లక్ష్యంగా నిర్ణయించారు. శాఖల వారీగా వివరాలు పరిశీలిస్తే వ్యవసాయం నుంచి రూ.86 కోట్లు ఆదాయం రాగా నాలుగు శాతం వృద్ధితో 2029 కల్లా ఏటా రూ.102 కోట్లు, ఉద్యానవనాల నుంచి రూ.477 కోట్లు ఉండగా ఏటా ఏడు శాతం వృద్ధితో రూ.711 కోట్లు, లైవ్ స్టాక్ నుంచి రూ.1085 కోట్లు సమకూరగా ఏటా పది శాతం వృద్ధితో రూ.1,932 కోట్లు, మత్స్య శాఖ నుంచి రూ.1,833 కోట్లు రాగా ఏటా 13 శాతం వృద్ధితో రూ.3,488 కోట్లకు పెంచాలని నిర్ణయించారు. బీడు భూముల్లో పంటల సాగు ప్రధానంగా నేచురల్ ఫార్మింగ్, చిరుధాన్యాల సాగు, తోటల పెంపకం, ఇంకా పంటల నిల్వకు శీతల గిడ్డంగులు, మేలు జాతి పశువుల పెంపకం, సముద్ర మత్స్య ఉత్పత్తులు పెంపు, ఫిష్ జట్టీలు ఏర్పాటు, చేపల వేటకు మత్స్యకారులకు ఆధునిక పనిముట్లు అందజేయడం వంటివి చేయాలని ప్రణాళికలు పొందుపరిచారు.

పారిశ్రామిక రంగంలో 15.55 శాతం వృద్ధి లక్ష్యం

పారిశ్రామిక ఉత్పత్తిలో 2022-23లో రూ.59,264 కోట్ల ఆదాయంతో రాష్ట్రంలో విశాఖ జిల్లా ప్రథమ స్థానంలో ఉంది. ఏటా 15.55 శాతం వృద్ధితో 2028-29కల్లా ఆదాయం రూ.1,29,269 కోట్లకు పెంచాలని లక్ష్యంగా నిర్ణయించారు. 2022-23లో మైనింగ్ శాఖ నుంచి రూ.30 కోట్లు ఆదాయం రాగా ఏటా మూడు శాతం వృద్ధితో రూ.38 కోట్లకు పెంచనున్నారు. ఉత్పత్తి రంగంలో రూ.10,031 కోట్ల ఆదాయం రాగా 18 శాతం వృద్ధితో రూ.25,841 కోట్లకు, విద్యుత్, గ్యాస్, నీటి సరఫరా వాటా కింద రూ.2,829 కోట్లు రాగా ఏటా 15 శాతం వృద్ధితో 6,543 కోట్లు ఆదాయం సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ప్రస్తుతం ఉన్న పరిశ్రమల్లో మరింత ఉత్పత్తి పెంచడం, చిన్న, కుటీర, మధ్యతరహా పరిశ్రమ రంగాన్ని ప్రోత్సహించాలని ప్రతిపాదించారు. ప్రస్తుతం ఈ రంగాల్లో రూ.144.61 కోట్లతో 813 యూనిట్లు స్థాపించి 5129 మంది ఉపాధి కల్పించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రోత్సాహంతో అమలుచేస్తున్న ఉపాధి పథకాలను వేగంగా మంజూరుచేయడం, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు తరచు శిక్షణ శిబిరాలు నిర్వహించి ప్రోత్సహించడం వంటి చేపట్టాలని నిర్ణయించారు.

సేవల రంగంలో 15.61 శాతం వృద్ధి లక్ష్యం

జిల్లాలో 2022-23లో సేవల రంగం నుంచి 43.88 శాతం వాటాతో రూ.49,131 కోట్లు ఆదాయం వచ్చింది. దీనిని 2028-29కల్లా ఏటా 15.61 శాతం వృద్ధితో రూ.1,12,948 కోట్లకు పెంచాలని లక్ష్యంగా నిర్ణయించారు. వ్యాపారం, హోటళ్లు, రెస్టారెంట్ల నుంచి రూ.13,917 కోట్ల ఆదాయం రాగా ఏటా 18 శాతం వృద్ధితో రానున్న ఐదేళ్లలో రూ.34,910 కోట్లకు చేర్చాలని నిర్దేశించుకున్నారు. రవాణా, గిడ్డంగులు తదితర రంగాల నుంచి రూ.9,350 కోట్ల ఆదాయం రాగా ఏటా 17 శాతం వృద్ధితో రూ.22,684 కోట్లు, రియల్ ఎస్టేట్, దాని అనుబంధ రంగాల నుంచి రూ.6,464 కోట్ల ఆదాయం రాగా ఏటా 16 శాతం వృద్ధితో రూ.15,208 కోట్లు, ఇతర సేవల విభాగాల నుంచి రూ.6,667 కోట్లు రాగా 15.74 శాతంతో రూ.12,070 కోట్లు ఆదాయం సేకరించాలని ప్రతిపాదించారు. సేవల రంగం ఆదాయం పెంపునకు సంబంధించి ప్రధానంగా ఆగ్నేసియా దేశాల నుంచి బౌద్ధ పర్యాటకులకు ఆకర్షించడం, సముద్రంలో క్రూయిజ్‌ల నిర్వహణ, యాటింగ్, సీప్లేన్, బీచ్‌లకు వచ్చే పర్యాటకుల సంఖ్య పెంచడం, వాటర్ స్పోర్ట్స్, హెల్త్, కల్చరల్ పర్యాటక రంగాలను ప్రోత్సహించాలని ప్రణాళికలు పొందుపరిచారు.

సంతానలేమితో సతమతం

... 5వ పేజీ తరువాయి

పాటించకుండా దంపతులు ఇద్దరూ ఏడాదిపాటు కలిసి ఉంటున్నా సంతానం కలగకపోతే సంతానలేమి సమస్యగా పేర్కొంటారు. ఏడాది దాటితే వైద్యులను సంప్రతించాల్సిన అవసరం ఉందని నిపుణులు చెబుతున్నారు. ప్రపంచవ్యాప్తంగా 15 శాతం మంది జంటలు ఈ తరహా సమస్యతో బాధపడుతున్నట్టు ప్రపంచ ఆరోగ్య సంస్థ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ఇటువంటి వారంతా వైద్యులను సంప్రతించి సమస్యను తెలుసుకోవడం చాలా కీలకంగా డాక్టర్ రాధ పేర్కొన్నారు. సంతాన లేమి సమస్యకు ఏ ఒక్కరో కారణం కాదన్న విషయాన్ని గుర్తించాల్సిన అవసరం ఉంది. పిల్లలు పుట్టకపోవడానికి మహిళలు 30 శాతం, పురుషులు 30 శాతం, మరో 30 శాతం ఇద్దరూ కారణం కావచ్చునని, పది శాతం కారణాలు తెలియవని వైద్యులు చెబుతున్నారు. అయితే, సంతానలేమి సమస్య అనగానే మహిళలను చాలామంది బాధ్యులు చేస్తుంటారని, ఇది తప్పు అని కేజీహెచ్ గైనాకాలజీ విభాగ సీనియర్ వైద్య నిపుణులు డాక్టర్ సంధ్యాదేవి పేర్కొన్నారు.

మహిళల్లో సమస్యలు ఇవే

మహిళల్లో సంతానలేమి సమస్యకు కారణాలుగా వైద్యులు పలు అంశాలను పేర్కొంటున్నారు. ట్యూబల్ బ్లాకేజీ, ఫెలోపియన్ ట్యూబులు పూడుకుపోవడం, హార్మోన్ల అసమతుల్యత కారణంగా అండం విడుదల కాకపోవడం, పూర్తిస్థాయిలో ఎగ్ ఫార్మ్ కాకపోవడం, అండాశయంలో కొన్నిరకాల సమస్యలు వంటివి సంతానలేమి సమస్యకు కారణమవుతున్నాయి.

పురుషుల్లో ఇబ్బందులు..

స్పెర్మ్ కౌంట్ (వీర్య కణాల సంఖ్య) తగ్గడం, నాణ్యత లోపించడం, కణాల కదలిక క్షీణించడం (సాధారణంగా 100 ఎంఎల్ వీర్యంలో 15 మిలియన్ల కణాలు ఉండాలి) వంటి కారణాలుగా చెబుతున్నారు.

ఈ కారణాలతోనే సమస్య..

మహిళలు, పురుషుల్లో ఈ సమస్య రావడానికి జీవన విధానంలో వచ్చిన మార్పులు, అలవాట్లు కారణంగా వైద్యులు చెబుతున్నారు. మహిళల్లో థైరాయిడ్, హార్మోన్ల అసమతుల్యత, పీసీఓడీ, అధిక బరువు వంటి ఇబ్బందులు అధికం అవుతున్నాయి. ఇవి అండం విడుదల కాకపోవడానికి కారణమవుతున్నాయి. అందుకు శారీరక శ్రమ లేకపోవడం, పోషకాలు లేని ఆహారాన్ని తీసుకోవడం, జంక్ ఫుడ్ తీసుకోవడం, సరైన నిద్ర లేకపోవడం వంటి అంశాలు దోహదం చేస్తున్నాయి. పురుషుల్లో ధూమపానం, మద్యపానం, ఒబెసిటీ, ఆహారపు అలవాట్లు, ఇతర వ్యసనాలు కారణమవు తున్నాయి. ఇద్దరిలోనూ వృత్తిపరమైన టెన్షన్, ఒత్తిడి, ఆలస్యంగా వివాహాలు చేసుకోవడం వంటి అంశాలు ఈ సమస్యను మరింత రెట్టింపు చేస్తున్నట్టు వైద్యులు పేర్కొంటున్నారు.

పరీక్షలో నిర్ధారణ

సంతానలేమి సమస్యకు అసలు కారణం ఏమిటో నిర్ధారించిన తరువాత వైద్యులు ఏం చేయాలో వివరిస్తారు. ఇందుకోసం పరీక్షలు చేయిస్తారు. దీన్నే ఇవాల్యూయేషన్ ప్రాసెస్‌గా చెబుతారు. పరీక్షల్లో స్పెర్మ్ కౌంట్ తక్కువగా ఉండడం వల్ల పిల్లలు పుట్టడం లేదా? లేక ఎగ్ రిలీజ్‌లో ఉన్న ఇబ్బందులు ఉన్నాయా?..అనేది నిర్ధారిస్తారు. మందుల వల్ల ప్రయోజనం లేనట్టయితే ఇన్‌విట్రో ఫెర్టిలైజేషన్ (ఐవీఎఫ్)కు రిఫర్ చేస్తారు. ఇందులో వివిధ రకాల పద్ధతులు ఉంటాయి. సాధారణంగా భార్య, భర్త కలిసినప్పుడు జరిగే ప్రక్రియను సాంకేతిక పద్ధతులను అనుసరించి పిండం ఏర్పడేలా చేసి పిల్లలు పుట్టేలా చేస్తారు.

తగిన జాగ్రత్తలతో చెక్..

కొన్నిరకాల జాగ్రత్తలను తీసుకోవడం వల్ల సంతానలేమి సమస్య ఉత్పన్నం కాకుండా చూసుకునేందుకు అవకాశం ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. ఒత్తిడి లేని జీవన విధానాన్ని కొనసాగించడం, శారీరక శ్రమ చేయడం, బరువును నియంత్రణలో ఉంచుకోవడం, స్మోకింగ్, ఆల్కహాల్ వంటి దురలవాట్లకు దూరంగా ఉండడం, పోషకాలతో కూడిన ఆహారాన్ని తీసుకోవడం, 30 ఏళ్లలోపు వివాహాలు చేసుకోవడం, కెరియర్, ఇతర అవకాశాలు అంటూ పెళ్లైన తరువాత సంవత్సరాల తరబడి కుటుంబ నియంత్రణ పద్ధతులు పాటించడం వంటి వాటికి దూరంగా ఉండడం ద్వారా సంతానాన్ని పొందవచ్చునని నిపుణులు సూచిస్తున్నారు.

పెరుగుతున్న కేసులు

సంతానలేమితో బాధపడే వారికి వైద్య సేవలు అందించేందుకు నగరంలో 30 వరకు ఫెర్టిలిటీ సెంటర్లు ఏర్పాటయ్యాయి. ఒక్కో ఆస్పత్రిలో నిత్యం కనీసం పది నుంచి 20 మంది సేవలను పొందుతున్నారు. ఈ సంఖ్య రానున్న రోజుల్లో మరింత పెరిగే అవకాశం ఉందంటున్నారు. వైద్య రంగంలో ప్రస్తుతం ఇదే అతిపెద్ద వ్యాపారంగా కొనసాగుతోంది.

యువ జంటల్లోనూ పెరుగుతున్న సమస్య

గతంతో పోలిస్తే సంతానలేమితో బాధపడుతున్న జంటల సంఖ్య గణనీయంగా పెరిగింది. కేజీహెచ్‌కు దాదాపు 15 నుంచి 20 శాతం ఇటువంటి కేసులు వస్తున్నాయి. ఇరవై ఐదేళ్లలోపు వయసున్న అమ్మాయిల్లో కూడా ఎగ్ రిలీజ్ సమస్య, అబ్బాయిల్లో స్పెర్మ్ కౌంట్ తక్కువగా ఉండడం వంటివి చూస్తున్నాం. జీవన విధానంలో వచ్చిన మార్పుల కారణంగా ఈ తరహా సమస్యలు పెరుగుతున్నాయి. కొన్ని రకాల జాగ్రత్తలు తీసుకుంటే ఇటువంటి ఇబ్బందులు నుంచి బయటపడవచ్చు. కొందరు కావాలనే కొన్నాళ్లపాటు పిల్లలను వద్దనుకుంటారు. వృత్తిపరమైన ఒత్తిళ్లు, ఇతర ఇబ్బందులతో తరువాత కావాలనుకున్నా ఫలితం దక్కడం లేదు. కాబట్టి, 30 ఏళ్లలోపు పిల్లలు వద్దు అనుకునే ఆలోచన నుంచి యువ జంటలు రావాలి. పిల్లలు పుట్టిన తరువాత కూడా జీవితంలో ఉన్నత స్థానాలకు వెళ్లినవారు ఎంతోమంది ఉన్నారు. పిల్లలు పుట్టలేదని మానసిక వేదనకు గురికావాల్సిన అవసరం లేదు. అధునాతన వైద్య పద్ధతులను అనుసరించి పిల్లలను పొందేందుకు అనువైన మార్గాలు ఉన్నాయి.

-డాక్టర్ ఐ.వాణి,
గైనకాలజీ వైద్యులు, కేజీహెచ్

ఆరోగ్య శాఖలో బదిలీలు

... 5వ పేజీ తరువాయి

నియమితులయ్యారు.

అనకాపల్లి డీఎంహెచ్‌వోగా రవికుమార్

చిత్తూరు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారిగా పనిచేస్తున్న డాక్టర్ ఓ.ప్రభావతి దేవి పాడేరు జిల్లా అడిషనల్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణిగా నియమితు లయ్యారు. కాగా, విజయనగరం జిల్లా గజపతి నగరం ఏరియా ఆస్పత్రిలో పనిచేస్తున్న డాక్టర్ పి.రవికుమార్ అనకాపల్లి జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారిగా నియమితులయ్యారు.

బాలికపై అత్యాచారం : యువకుడిపై కేసు నమోదు

మద్దిలపాలెం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రేమ పేరుతో బాలికను లోబర్చుకున్న రేసపువానిపాలేనికి చెందిన ఆటోడ్రైవర్ ముకేశ్‌కుమార్‌పై శనివారం మూడోపట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. అదే ప్రాంతానికి చెందిన ఓ బాలికను ప్రేమిస్తున్నానంటూ నమ్మబలికాడు. వివాహం చేసుకుంటానని చెప్పి పలుమార్లు అత్యాచారానికి పాల్పడి పట్టించుకోవడం మానేశాడు. ఈ నేపథ్యంలో బాలిక తనను వివాహం చేసుకోవాలని ముకేష్‌కుమార్‌ను నిలదీసింది. అతడు ససేమిరా అనడంతో పోలీసులను ఆశ్రయించింది. పోలీసులు కేసు నమోదు చేశారు.



అర్జున్‌రామ్ మేఘవాల్‌కు స్వాగతం పలుకుతున్న బీజేపీ నాయకులు

కేంద్ర మంత్రికి స్వాగతం

గోపాలపట్నం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): నగర పర్యటనకు విచ్చేసిన కేంద్ర సాంస్కృతిక, న్యాయశాఖ సహాయ మంత్రి అర్జున్‌రామ్ మేఘవాల్‌కు బీజేపీ నగర నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. శనివారం సాయంత్రం విశాఖ విమానాశ్రయానికి చేరుకున్న కేంద్ర మంత్రికి రాష్ట్ర బీజేపీ ప్రోటోకాల్ కన్వీనర్ బాల రాజేశ్వరరావు, నాయకులు సునీల్, దీపిక అగర్వాల్, పృథ్వీరాజ్, తదితరులు ఆహ్వానించారు.

ఆటల పోటీలు ప్రారంభం

మల్కాపురం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సర ఆగమనాన్ని పురస్కరించుకొని షిప్‌యార్డు గుర్తింపు యూనియన్ (ఇంటక్) ఆధ్వర్యంలో షిప్‌యార్డు కాలనీలోని జీవీ నిలయం స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో శనివారం సాయంత్రం ఆటల పోటీలను ప్రారంభించారు. ఈ పోటీలను షిప్‌యార్డు షిప్పింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ రాకేష్ ప్రసాద్ జ్యోతి ప్రజల్వన చేసి ప్రారంభించారు. క్రీడలు ఉద్యోగుల మానసిక ఉల్లాసానికి దోహదపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో జీఎం (హెచ్‌ఆర్) రాజేంద్ర రాజగోపాల్, హెచ్ఎస్‌వోఏ అధ్యక్షుడు సదాశివ, డీజీఎం సుశీల్‌కుమార్, గుర్తింపు యూనియన్ ప్రధాన కార్యదర్శి శ్రీరామ్మూర్తి, హెచ్ఎస్‌డబ్ల్యుఎస్ఎస్ సెక్రటరీ సునీల్ జయంతి, యూనియన్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

25న చిత్రలేఖనం పోటీలు

మల్కాపురం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ చిత్రకారులు వడ్డాది పాపయ్య, అంట్యాకుల పైడిరాజుల వర్ధంతి సందర్భంగా విశాఖపట్నం జిల్లా విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహిస్తున్నట్టు చిత్రకళా పరిషత్ ప్రధాన కార్యదర్శి సుంకర చలపతిరావు తెలిపారు. పోటీలు ఈ నెల 25న కంచరపాలెం లోని బీఎస్‌ఆర్ భవనంలో జరుగుతాయన్నారు. ఒకటి నుంచి పదో తరగతి బాలబాలికలు తమకు నచ్చిన అంశాన్ని, నచ్చిన పద్ధతిలో చిత్రించవచ్చని సూచించారు. పోటీల్లో పాల్గొనే వారికి నిర్వాహకులే డ్రాయింగ్ పేపర్ అందజేస్తారని తెలిపారు. ప్రవేశ రుసుము రూ.20 ఉంటుందన్నారు. విజేతలకు ఈ నెల 29న బహుమతులు అందజేయనున్నట్టు వెల్లడించారు. వివరాల కోసం 79893 36162, 91546 88223 ఫోన్ నంబర్లను సంప్రదించాలని కోరారు.

అన్నదానానికి రూ.లక్ష విరాళం

అక్కిరెడ్డిపాలెం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ధనుర్మాసోత్సవాల్లో భాగంగా శనివారం షీలానగర్ ఎస్టీబీఎల్ ప్రాంగణంలోని తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో స్వామివారికి భక్తులు శ్రీవారికి తిరుప్పావై పాశురాలు విన్నవించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం ప్రత్యేక వేదికపై శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారిని ఆశీనులను చేసి వేదపండితులు స్వామివారికి పుష్పాలతో సహస్రనామార్చన, నక్షత్ర, కుంభ హారతి ఇచ్చారు. ఈ సందర్భంగా అన్నదాన ట్రస్టుకు కాకానినగర్‌కు చెందిన యార్లగడ్డ ఎల్లమనీయుడు దంపతులు రూ.లక్ష విరాళాన్ని పాలక మండలి సభ్యులకు అందజేశారు.

సినిమా గైడ్

- **బచ్చలమల్లి:** సంగం, రమాదేవి, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య-2 (గాజువాక), తాతా (తగరపువలస)
- **విడుదల-2:** శ్రీకన్య, వెంకటేశ్వర, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), మినీమోహిని(గాజువాక), శ్రీరాములమ్మ (తగరపువలస)
- **యువి:** శారద, శ్రీనరసింహ (గోపాలపట్నం), హెవెన్ (గాజువాక)
- **ముఫాసా:** జగదాంబ, శ్రీరామ, శ్రీవెంకటేశ్వర, కామేశ్వరి, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), శ్రీకన్య మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), నటరాజ్-2 (పెందుర్తి), గణేష్ (తగరపువలస)
- **పుష్ప-2:** మెలోడి, శరత్, ఊర్వశి (కంచరపాలెం), సౌజన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-1 (పెందుర్తి), సప్తగిరి (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 32, టమాటా 20, వంకాయలు (తెలుపు) 38, వంకాయలు (నలుపు) 48, బెండకాయలు 40, పచ్చిమిర్చి 32, కాకరకాయలు 42, బీరకాయలు 48, ఆనపకాయ 20, కాలీఫ్లవర్ 16, క్యాబేజి 24, క్యారెట్ 36 దొండకాయలు 44, బంగాళదుంపలు 30, అరటికాయ (పెద్దది) 6, మునక్కాడలు(కిలో) 140, అల్లం (పాతది) 56, బరబాటి 42, ముల్లంగి 18, నిమ్మకాయలు (కిలో) 60, గోరుచిక్కుడు 30 దోసకాయలు 28, వెల్లుల్లి (పెద్దవి) 340, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్(పెన్సిల్) 60, పొటల్స్ 56, కీరదోస 36, క్యాప్సికమ్ 56, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 30, చిలగడదుంపలు 34, కంద 64, దేముడుచిక్కుడు 38, కొండఉసిరి 55, కరివేపాకు (కిలో)60, కొత్తిమీర (పెద్దకట్ట) 35, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 100, మామిడి అల్లం 64, కర్రపెండలం 28, బొప్పాయి 40, బూడిద గుమ్మడికాయ 30, జామకాయలు (కిలో) 45.

కోడిగుడ్లు (నెక్)
(వంద - రూ.లలో)

విశాఖపట్నం	590
విజయనగరం	594
శ్రీకాకుళం	594

చికెన్ ధరలు
బ్యాగ్

రైతు ధర	90
ఫారం ధర	110
విత్ స్కిన్	190
స్కిన్‌లెస్	200

ముస్లింలకు రాజకీయ ప్రాధాన్యం

- శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు
- నూర్‌బాషాలు కార్యసాధకులు కావాలి: మంత్రి ఎన్ఎండీ ఫరూక్



కార్యక్రమంలో మాట్లాడుతున్న స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు

పెందుర్తి, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ముస్లింల సంక్షేమం, అభ్యున్నతి, విద్య, ఉపాధి నైపుణ్యం కల్పనకు కూటమి ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. నామినేటెడ్ పదవుల్లో మైనారిటీలకు రాజకీయ ప్రాధాన్యం కల్పిస్తున్నామన్నారు. ఉమ్మడి విశాఖ జిల్లా నూర్‌బాషా దూదేకుల జన గర్జన మహాసభను శనివారం పెందుర్తిలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం దూదేకుల వారికి అండగా ఉంటుందన్నారు. ముస్లిం యువతకు వృత్తి నైపుణ్యంలో శిక్షణ ఇచ్చి భవిష్యత్తులో ఔత్సాహిక వ్యాపార, పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు కార్యాచరణ ప్రణాళికను అమలు చేస్తుందన్నారు. ప్రభుత్వ చేయూతతో యువత, మహిళలు స్వయం ఉపాధితో ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని, వారు తయారు చేసే వస్తువులకు బ్రాండింగ్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. సృజన, నైపుణ్యతకు బ్రాండింగ్ తోడ్పాటైతే సత్ఫలితాలు వస్తాయని పేర్కొన్నారు.

మైనారిటీ శాఖా మంత్రి ఎన్ఎండీ ఫరూక్ మాట్లాడుతూ నూర్‌బాషాలు ఆత్మగౌరవాన్ని పరిరక్షించుకుంటూనే హక్కులను సాధించుకుని సమష్టిగా కార్యసాధకులు కావాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రాజకీయ, ఇతర రంగాల్లో సముచిత స్థానం కల్పించేందుకు మంత్రిగా తనవంతు కృషి చేస్తానన్నారు. పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు మాట్లాడుతూ సంఘ ఐక్యతను చాటిచెప్పే ఇటువంటి బృహత్తర కార్యక్రమాలు ముస్లిం యువతకు స్ఫూర్తిదాయకమన్నారు.

నూతన భవనం ప్రారంభం

పెందుర్తిలోని ద్రోణంరాజునగర్‌లో కొత్తగా నిర్మించిన విశాఖ జిల్లా నూర్‌బాషా, దూదేకుల నూతన భవనాన్ని స్పీకర్ అయ్యన్నపాత్రుడు, మంత్రి ఫరూక్‌లు శిలాఫలకాన్ని ఆవిష్కరించి ప్రారంభించారు. అనంతరం సంఘం ఆధ్వర్యంలో ప్రముఖులకు ఘనంగా సత్కరించారు. ఇస్లాంలో తారతమ్యాలు లేవని, అందరూ సమానమని వారు ఉద్ఘాటించారు. ఉమ్మడి విశాఖ జిల్లా అధ్యక్షుడు షేక్ బాబ్జీ, ఆహ్వాన కమిటీ చైర్మన్ షేక్ ఖాన్‌సాహెబ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గ్రేటర్ ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావు, యువజన ముస్లిం సంఘ ప్రతినిధి షేక్ షఫీ ఉల్లా ఫీర్ మహ్మద్, మస్తానమ్మ, సుబాన్, షేక్‌రెహమాన్, దావూద్ అలీ, సలీమ్ ఖాసీం పాల్గొన్నారు.

దేవాలయాలకు ధార్మిక సంస్థలను ఏర్పాటు చేయాలి

బీజేపీ 'గాజువాక' కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు



ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

గాజువాక, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): హిందూ ఆలయాలకు ధార్మిక సంస్థలను ఏర్పాటు చేసి స్వయం ప్రతిపత్తి కల్పించాలని భారతీయ జనతా పార్టీ గాజువాక నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు అన్నారు. హిందూ మహాసభ ప్రచార రథాన్ని శనివారం ఆయన గాజువాకలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఆదివారం పాత గాజువాకలో హిందూ మహాసభను నిర్వహించనున్నామన్నారు. అన్యాక్రాంతమైన దేవదాయ భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకుని, భవిష్యత్తులో ఆక్రమణకు గురి కాకుండా పటిష్ఠ చర్యలు చేపట్టాలన్నారు. పాత గాజువాకలో జరగనున్న సభను ప్రజలంతా విజయవంతం చేయాలని కరణంరెడ్డి కోరారు. కార్యక్రమంలో నాయకులు దీనంకొండ కృష్ణంరాజు, సంతోశ్, కృష్ణ, జగదీశ్, వర్మరాజు, రాజశేఖర్, గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రా బాలుర కబడ్డీ జట్టు సెలక్షన్ కమిటీ చైర్మన్‌గా కనకరాజు



ఉరుకూటి కనకరాజు

అగనంపూడి, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రా బాలుర కబడ్డీ జట్టు సెలక్షన్ కమిటీ చైర్మన్‌గా గాజువాకకు చెందిన ఉరుకూటి కనకరాజు నియమితులయ్యారు. ఈ మేరకు ఆంధ్ర కబడ్డీ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ యలమంచిలి శ్రీకాంత్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా రావులపాలెంలో ఆదివారం నుంచి ఈ నెల 25 వరకు జరగనున్న 50వ ఏపీ రాష్ట్ర బాలుర అంతర్ రాష్ట్ర కబడ్డీ చాంపియన్ పోటీలకు సెలక్షన్ కమిటీ చైర్మన్‌గా కనకరాజు వ్యవహరించనున్నారు. ఈ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఆంధ్రా జట్టుకు ఎంపిక చేస్తారు. రాష్ట్ర స్థాయి బాలుర కబడ్డీ జట్టు సెలక్షన్ కమిటీ చైర్మన్‌గా తనను నియమించడం పట్ల కనకరాజు ఆనందం వ్యక్తం చేశారు.

డీసీసీబీ పర్సన్ ఇన్‌చార్జిగా జేసీ పదవీకాలం పొడిగింపు

విశాఖపట్నం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ (డీసీసీబీ) అఫీషియల్ పర్సన్ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్న జాయింట్ కలెక్టర్ పదవీకాలాన్ని మరో ఆరు నెలలు పొడిగించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గత ప్రభుత్వం నియమించిన నామినేటెడ్ పర్సన్ ఇన్‌చార్జిలను తొలగించి జాయింట్ కలెక్టర్లకు ఆ బాధ్యతలను అప్పగించారు. జూన్‌లో ఇచ్చిన ఆదేశాలు ఈ నెల 26తో ముగియనున్నందున ఈ నెల 27వ తేదీ నుంచి ఆరు నెలల పాటు అఫీషియల్ పర్సన్ ఇన్‌చార్జిగా జేసీ కొనసాగుతారని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

వర్షంతో హెచ్‌పీసీఎల్ విస్తరణ పనులకు బ్రేక్

మల్కాపురం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): హెచ్‌పీసీఎల్ విస్తరణ పనులకు వర్షం కారణంగా బ్రేక్ పడింది. ఈ పనులు బయట ప్రాంతంలో జరుగుతుండడంతో కార్మికులు పని చేయలేకపోతున్నారు. పనులు జరుగుతున్న ప్రాంతం బురదగా ఉండడంతో కార్మికులు అడుగు తీసి అడుగు వేయలేని స్థితిలో ఉన్నారు. పెద్దసంఖ్యలో కార్మికులు పనులకు వెళ్లినా పరిస్థితి అనుకూలించక తిరిగి ఇళ్లకొచ్చేశారు. షిప్‌యార్డు, డాక్‌యార్డులలో కూడా కొంతమంది విధులకు హాజరు కాలేకపోతున్నారు.

నమ్మిదొడ్డిలో కుళ్లిన మృతదేహం లభ్యం

కూర్మన్నపాలెం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): పెదగంట్యాడ మండలం నమ్మిదొడ్డి సమీపంలో లక్ష్మీనగర్‌లో కుళ్లిన మృతదేహాన్ని దువ్వాడ పోలీసులు కనుగొన్నారు. దువ్వాడ సీఐ మల్లేశ్వరరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. హిందుజా పవర్ ప్లాంటులో పెయింటింగ్ పనులు చేసేందుకు మద్ది వెంకటరావు అనే వ్యక్తి ఇతర రాష్ట్రాల నుంచి కూలీలను తీసుకువచ్చి లక్ష్మీనగర్‌లోని షెడ్లలో ఆశ్రయం కల్పిస్తుంటారు. ఈ క్రమంలో ఇక్కడ నివాసమున్న కూలీలు మార్చి నెలలో సొంతూళ్లకు వెళ్లిపోయారు. దీంతో షెడ్డు నిరుపయోగంగా ఉంది. ఇటీవల వచ్చిన కూలీలు ఇక్కడ ఉంటున్నారు. కాగా శనివారం షెడ్లు, ఇళ్ల పరిసరాలను శుభ్రం చేస్తుండగా ప్రహరీకి, షెడ్లకు మధ్య కుళ్లిన మృతదేహాన్ని గుర్తించారు. మృతదేహం బాగా కుళ్లిపోయి గుర్తు పట్టలేని స్థితిలో ఉండడంతో పాటు బయటకు తీసేందుకు ఇబ్బందికరంగా మారింది. మృతుడు నీలిరంగు ట్రాక్ ఫ్యాంట్ ధరించి ఉన్నట్టు పోలీసులు గుర్తించారు. ఇక ఎలాంటి ఆధారాలు లభించలేదు. షెడ్లు శుభ్రపరిచిన వ్యక్తులు ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సభ్యత్వ నమోదును ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలి

టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్

కూర్మన్నపాలెం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అభివృద్ధికి, ప్రజా శ్రేయస్సుకు తెలుగుదేశం పార్టీ సేవలు ఎంతో అవసరమని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్ అన్నారు. 87వ వార్డు కణితిలో శనివారం నిర్వహించిన టీడీపీ సభ్యత్వ నమోదులో పాల్గొన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సభ్యత్వ నమోదును ప్రతి కార్యకర్త ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలన్నారు. ప్రజా సంక్షేమం కోసం గోతులు లేని రోడ్లు, ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ, ప్రభుత్వ ఉద్యోగులు, సామాజిక పింఛన్లు ఒకటో తేదీనే పంపిణీ, తదితర కార్యక్రమాలను ప్రభుత్వం చేపడుతుందన్నారు. సమావేశంలో నాయకులు ఎస్ఎస్ విజయరామరాజు, రాజన్‌రాజు, ఎం.రాము, సత్తిబాబు, పి.దానయ్య, సిరసపల్లి శ్రీను, తదితరులు పాల్గొన్నారు.



చీరలు పంపిణీ చేస్తున్న చింతలపూడి వెంకట్రామయ్య, ప్రగడ విజయలక్ష్మి, వేణుబాబు తదితరులు



పెందుర్తిలో కేక్ కటింగ్ కార్యక్రమంలో పాల్గొన్న దాడి ఉమామహేశ్వరరావు, తదితరులు

ఘనంగా జగన్ జన్మదిన వేడుకలు

కూర్మన్నపాలెం/మింది, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ జన్మదిన వేడుకలను 87వ వార్డు కణితి కాళింగుల వీధిలో వైసీపీ జిల్లా కార్యదర్శి ప్రగడ విజయలక్ష్మి, వేణుబాబుల ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకట్రామయ్య, తదితరులు చిన్నారులకు పుస్తకాలు, వృద్ధులకు దుస్తులు, రోగులకు పండ్లు పంపిణీ చేశారు. అదేవిధంగా జగన్ జన్మదినాన్ని పురస్కరించుకుని మిందిలో కార్పొరేటర్ గుడివాడ అనూష కేక్ కట్ చేశారు. వైసీపీ నాయకులు గుడివాడ లతీశ్, ఎస్.నూకరాజు, సయ్యద్ హుస్సేన్, వెంకటరావ, సత్యవతి, తదితరులు పాల్గొన్నారు.

పెందుర్తి: పెందుర్తిలో వైసీపీ అధినేత జగన్మోహన రెడ్డి జన్మదిన వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. వైసీపీ కార్యాలయంలో కేకును పార్టీ వార్డు అధ్యక్షుడు దాడి ఉమామహేశ్వరరావు కత్తిరించి కార్యకర్తలకు తినిపించారు. జై జగన్ నినాదాలు చేశారు. అనంతరం లయోలా వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నదానం చేశారు. పండ్లు రొట్టెలను పంపిణీ చేశారు. సీనియర్ నేత గండి రవికుమార్, శరగడం కృష్ణవేణి, దొగ్గ గౌతమ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

చిన ముషిడివాడ రెవెన్యూ సదస్సులో 69 అర్జీల స్వీకరణ

పెందుర్తి, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): చినముషిడివాడలో శనివారం రెవెన్యూ అధికారులు సదస్సు నిర్వహించారు. కార్పొరేటర్ సేనాపతి వసంత శంకరరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ సదస్సుకు హాజరైన ఎస్‌హెచ్ 16 ఎస్‌డీసీ జె.సీతారామారావు భూ సమస్యలకు సంబంధించిన అర్జీలను స్వీకరించారు. రెవెన్యూ సదస్సుల ప్రాధాన్యతను వివరించారు. వివిధ సమస్యలకు సంబంధించి 69 అర్జీలను అధికారులు స్వీకరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఆనంద్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ ఆస్పత్రికి మల్టీపర్పస్ వెహికల్

మల్కాపురం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): సామాజిక సేవ కార్యక్రమాలలో భాగంగా హిందుస్థాన్ షిప్‌యార్డు సౌజన్యంతో హోమీబాబా క్యాన్సర్ ఆసుపత్రి, పరిశోధన కేంద్రానికి మల్టీపర్పస్ వెహికల్‌ను షిప్‌యార్డు షిప్ బిల్డింగ్ సెంటర్ డైరెక్టర్ రాకేశ్ ప్రసాద్ శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ షిప్‌యార్డు ఆధ్వర్యంలో అనేక సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో పలువురు షిప్‌యార్డు అధికారులు పాల్గొన్నారు.

ఆలయాల్లో వైభవంగా ధనుర్మాస పూజలు



నాయుడుతోటలో గోదాదేవికి సామూహిక కుంకుమ పూజలు నిర్వహిస్తున్న భక్తులు

వేపగుంట డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా నాయుడుతోట రవినగర్ శేషాద్రి కొండపై కొలువైన కల్యాణ వెంకటేశ్వరాలయంలో శనివారం గోదాదేవికి సామూహిక కుంకుమ పూజలు వైభవంగా నిర్వహించారు. తిరుప్పావై పఠనం, 6వ పాశురం విశిష్టతను ఆలయ అర్చకులు శ్రీనివాసస్వామి భక్తులకు వివరించారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

అక్కిరెడ్డిపాలెం: ధనుర్మాసోత్సవాల్లో భాగంగా శనివారం షీలానగర్‌లోని అయ్యప్పస్వామి ఆలయంలో భక్తులు లక్ష పుష్పార్చన నిర్వహించారు. ప్రధాన అర్చకులు కృష్ణన్ నంబూద్రి, వైద్యనాథన్‌ల ఆధ్వర్యంలో భక్తులు అయ్యప్ప స్వామిని పంచామృతాలతో అభిషేకించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం జరిగిన లక్ష పుష్పార్చనలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అలాగే బీహెచ్‌పీవీ ప్రసన్నగిరిపై గల శ్రీవేంకటేశ్వర వినాయకస్వామి దేవస్థానంలో అర్చకులు లక్ష్మణాచార్యులు, నారాయణాచార్యుల ఆధ్వర్యంలో శ్రీవారికి పంచామృతాలతో అభిషేకాలు జరిపాక ప్రత్యేక పుష్పాలు, నగలతో అలంకరించారు. అనంతరం భక్తులచే లక్ష తులసీ దళార్చన చేశారు.

పెందుర్తి: వెంకటాద్రి శిఖరంపై గల వేంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రీవారిని వజ్రకవచధారిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేసి హారతులిచ్చారు. గోదాదేవి అమ్మవారికి విశేష కుంకుమార్చన చేశాక తిరుప్పావై పఠించారు. గోదాదేవి ఏడో పాశురాన్ని స్వామికి నివేదించారు. భక్తుల గోవింద నామస్మరణతో వెంకటాద్రి మార్మోగింది. సరిపల్లిలో సీతారాముల విగ్రహాలతో కీర్తనలతో గ్రామంలో మేలుకొలుపు సంచారం చేశారు.

సందడిగా క్రిస్మస్ వేడుకలు



సెయింట్ ఆన్స్ కళాశాల విద్యార్థినుల నృత్య ప్రదర్శన

మల్కాపురం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక సెయింట్ ఆన్స్ కళాశాల ఆడిటోరియంలో శనివారం క్రిస్మస్ వేడుకలను సందడి వాతావరణంలో నిర్వహించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక, పాశ్చాత్య నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా సెయింట్ జోసెఫ్స్ చర్చి ఫాదర్ ప్రదీప్ మాట్లాడుతూ ప్రజలందరికీ సంతోషాన్ని పంచేదే క్రిస్మస్ అని అన్నారు. ఏసుక్రీస్తు మార్గంలో మానవ జీవితాన్ని సార్థకం చేసుకోవడమే క్రిస్మస్ పరమార్థమన్నారు. హెచ్‌పీసీఎల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రామకృష్ణ మాట్లాడుతూ ప్రజలకు సేవ చేయడంలో నిజమైన ఆనందం ఉంటుందన్నారు. కాలేజీ ప్రిన్సిపాల్ సిస్టర్ ప్రేమకుమారి, ఆస్పత్రి పరిపాలనాధికారి సిస్టర్ బిన్సీ, నర్సింగ్ స్కూల్ ప్రిన్సిపాల్ సిస్టర్ జైస్‌మేరి, నవజ్యోతి మహిళా సంఘం డైరెక్టర్ సంగీత, సీఐ విద్యాసాగర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సతీశ్, తదితరులు పాల్గొన్నారు.

వేపగుంట: వరలక్ష్మీనగర్‌లో గ్రేసియస్ చిల్డ్రన్ హోమ్‌లో క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనాథ పిల్లల సమక్షంలో కార్పొరేటర్ బల్ల శ్రీనివాసరావు కేక్ కట్ చేశారు. నిర్వాహకురాలు గ్రేస్ అనాథలకు చేస్తున్న సేవలను కొనియాడారు. శాంతాక్లాజ్ ఆకారంలో చిన్నారులు ఆకట్టుకున్నారు. నాయకులు ఆనంద్, మామిడి కిరణ్, సూరిబాబు, తదితరులు పాల్గొన్నారు.



పారిశుధ్య పనులను పర్యవేక్షిస్తున్న జెడ్సీ రాము

పారిశ్రామిక ప్రాంతంలో జెడ్సీ పర్యటన

మల్కాపురం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): పారిశ్రామిక ప్రాంతంలో జీవీఎంసీ జోన్- 5 కమిషనర్ రాము శనివారం పర్యటించారు. 40, 58 నుంచి 63 వార్డులలో ఆయన తిరిగి ప్రజలతో మాట్లాడి అనేక సమస్యలపై ఆరా తీశారు. వర్షాలు పడుతున్న నేపథ్యంలో గెడ్డలను పరిశీలించారు. ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎటువంటి ఇబ్బందులు ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ప్రజావసరాలను తెలుసుకుని వెంటనే సమకూర్చాలని అధికారులకు సూచించారు. ఆయన వెంట వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

వైద్యుల పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

ఉక్కుటౌన్‌షిప్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ జనరల్ ఆస్పత్రిలో కాంట్రాక్టు ప్రాతిపదికన వైద్యుల పోస్టుల భర్తీకి యాజమాన్యం దరఖాస్తులను ఆహ్వానిస్తుంది. సర్జరీ, పిడియాట్రిక్స్ గైనకాలజీ, ఆర్థోపెడిక్, జనరల్ మెడిషన్ విభాగాలలో ఎనిమిది పోస్టులకు భర్తీ చేసేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. ఎంబీబీఎస్ అర్హతతో ఈ పోస్టులను భర్తీ చేయనున్నారు. తొలి ఏడాది రూ.50 వేలు, రెండో ఏడాది రూ.55 వేల చొప్పున స్టయిఫండ్ ఇవ్వనున్నారు. అభ్యర్థుల వయస్సు గరిష్ఠంగా 35 ఏళ్లని, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు మూడేళ్ల సడలింపు ఉంటుందని ఉక్కు యాజమాన్యం పేర్కొంది. ఆసక్తి గలవారు ఈ నెల 30న ఆస్పత్రిలో జరగనున్న ఇంటర్వ్యూలకు హాజరు కావాలని తెలిపింది.

బీసీ రోడ్డులో భారీ వాహనాల పార్కింగ్

ఇబ్బందులు పడుతున్న ఉక్కు ఉద్యోగులు, కార్మికులు

ఉక్కుటౌన్‌షిప్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ బీసీ రోడ్డు నుంచి బ్రిడ్జి వరకు భారీ వాహనాలు ఇష్టానుసారంగా పార్కింగ్ చేస్తుండడంతో ఇతర వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుకు ఇరువైపులా భారీ వాహనాలను నిలిపివేస్తుండడం వల్ల ఈ మార్గంలో రాకపోకలు సాగించే ఉక్కు ఉద్యోగులు, కార్మికులు ఇబ్బందులు పడడమే కాకుండా ఒక్కోసారి రాత్రి వేళల్లో ప్రమాదాల బారిన పడుతున్నామని పలువురు కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత మూడు రోజులుగా అయితే భారీ వాహనాల పార్కింగ్ మరీ అధికంగా ఉందని, ఇక్కడ వాహనాలను నిలపరాదని సదరు డ్రైవర్‌లకు చెబుతున్నా పట్టించుకోవడం లేదని వారు చెబుతున్నారు. ఈ సమస్యల పరిష్కారానికి ఉక్కు అధికారులు తగిన చర్యలు చేపట్టాలని కార్మికులు కోరుతున్నారు.

పైపు లైన్ పగలడంతో నిలిచిన నీటి సరఫరా

తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్న మల్కాపురం వాసులు

మల్కాపురం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ విశాఖ 61వ వార్డు ఇండస్ట్రియల్ కాలనీలో ఉన్న జీవీఎంసీ ప్రధాన మంచినీటి పైప్‌లైన్ చెట్లవేర్లు కారణంగా పగిలిపోయింది. దీంతో రెండురోజులుగా మల్కాపురం, ఇండస్ట్రియల్ కాలనీ, జనతా కాలనీ, ప్రియదర్శిని కాలనీతో పాటు మరికొన్ని ప్రాంతాలకు తాగునీటి సరఫరా నిలిచిపోయింది. ప్రజలు ప్రైవేటు నీళ్ల విక్రయ కేంద్రాలకు వెళ్లి మంచినీళ్లు కొనుగోలు చేసి తెచ్చుకున్నారు. నీళ్లు లేక ఆహారం వండుకోలేక, బయట నుంచి కొని తెచ్చుకొని ఆకలి తీర్చుకుంటున్నారు. పారిశ్రామిక ప్రాంతం జీవీఎంసీ మంచినీటి సరఫరా విభాగం సిబ్బంది శుక్రవారం ఉదయం నుంచి మంచినీటి పైప్‌లైన్ పనులు చేస్తున్నా శనివారానికి కూడా పూర్తికాలేదు. దీంతో ఆదివారం అయినా మంచినీరు సరఫరా అవుతుందా...? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మంచినీటి ట్యాంకర్‌ను పంపక పోవడంతో ప్రజలు విమర్శిస్తున్నారు.

వైద్య సేవలను వినియోగించుకోవాలి

పెదగంట్యాడ, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): అదానీ గంగవరం పోర్టు పారిశ్రామిక ప్రాంతానికి అందిస్తున్న ఉచిత వైద్య సేవలను ప్రజలు వినియోగించుకోవాలని న్యూపోర్టు సీఐ తోకాడ కామేశ్వరరావు కోరారు. అదానీఫౌండేషన్, గంగవరం పోర్టు సంయుక్తంగా శనివారం నెల్లిముక్కులోని జీవీఎంసీ కల్యాణ మండపంలో నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. పారిశ్రామిక ప్రాంతంలోని ప్రజల ఆరోగ్యపరిరక్షణకు గంగవరం పోర్టు, అదానీ ఫౌండేషన్ సీఎస్‌ఆర్ నిధులు కేటాయిస్తుందన్నారు. టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పులి వెంకట రమణారెడ్డి మాట్లాడుతూ పెదగంట్యాడ నిర్వాసిత కాలనీలో తరచూ ఉచిత వైద్యశిబిరాలు నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో సీఎస్‌ఆర్ టీమ్ సభ్యులు సీహెచ్ రమేశ్‌బాబు, బాబ్జీ, ప్రసాద్, నేత్ర వైద్యనిపుణులు డాక్టర్ రేవతి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ ధ్యాన దినోత్సవం

అగనంపూడి, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రజాపిత ఈశ్వరీయ విశ్వ విద్యాలయం బ్రహ్మకుమారీస్ స్థానిక శాఖ ఆధ్వర్యంలో బీసీ కాలనీలో గల దివ్యజ్యోతి భవనం వద్ద శనివారం ప్రపంచ ధ్యాన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సంస్థ జిల్లా కో-ఆర్డినేటర్ బీకే సోమేశ్వరి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. నిత్య జీవితంలో మెడిటేషన్ గొప్పతనం గురించి వివరించారు. ఒత్తిడి నుంచి బయటపడేందుకు ధ్యానం ఎంతగానో దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు బీకే శేఖర్ బాయిజీ, రామకోటి, ప్రజా సంఘాల నాయకులు సుశీల గజేంద్రరరావు, బి.సత్యనారాయణ, ఈశ్వరరావు, రాజు, దుర్గ, రాధ, తులసి, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి అండర్-19 క్రికెట్ జట్టుకు ఏబీఎస్ విద్యార్థి ఎంపిక



వెంకటసాయి

అగనంపూడి, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి అండర్-19 బాలుర విభాగం క్రికెట్ జట్టుకు స్థానిక ఏబీఎస్ పబ్లిక్ స్కూల్ విద్యార్థి ఎం.వెంకటసాయి ఎంపికయ్యాడు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఇటీవల అనకాపల్లి ఎన్టీఆర్ స్టేడియంలో జరిగిన జిల్లా స్థాయి క్రికెట్ పోటీల్లో వెంకటసాయి విశేష ప్రతిభ కనబరిచి రాష్ట్ర పోటీలకు అర్హత సాధించాడు. త్వరలో కృష్ణా జిల్లా మచిలీపట్నంలో జరిగే రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీల్లో పాల్గొననున్నాడు. ఈసందర్భంగా శనివారం వెంకటసాయికి పాఠశాల వ్యవస్థాపకులు పీఎం. కొండయ్య, ప్రధానోపాధ్యాయులు పద్మజ, డైరెక్టర్ దీపక్‌లు అభినందించారు.

సామాజిక భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

మల్కాపురం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ విశాఖ 58వ వార్డు శ్రీరామ్‌నగర్‌లో రజక భవనాన్ని శనివారం రాష్ట్ర ప్రభుత్వ విప్, పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే పీజీవీఆర్ నాయుడు (గణబాబు), కార్పొరేటర్ గులిగిందల లావణ్య ప్రారంభించారు. రజక మహిళల కోసం వాషింగ్‌మిషన్‌లను ప్రభుత్వం అందజేస్తుందని గణబాబు తెలిపారు. అర్హులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇక్కడ సామాజిక భవనం సమీపంలో మరుగుదొడ్లు కోసం ప్రత్యేకంగా నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. వార్డులో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. వార్డు టీడీపీ అధ్యక్షుడు కోరాడ శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి పొత్తబత్తుల శ్రీనివాసరావు, వైసీపీ నాయకుడు గులిగిందల కృష్ణ, పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

శంకర్ ఫౌండేషన్ న్యూస్ లెటర్‌కు జాతీయ అవార్డు

వేపగుంట డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్రలో కంటి వైద్య సేవల్లో అత్యుత్తమ ప్రమాణాలు పాటిస్తున్న శంకర్ ఫౌండేషన్ ఆస్పత్రి జాతీయ స్థాయి అవార్డు కైవసం చేసుకుంది. పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా (పీఆర్ఎస్ఐ) ఏటా పత్రికల మేగ్‌జైన్, వైద్య సంబంధిత అంశాలపై వచ్చే కథనాలకు అవార్డులు అందజేస్తుంది. ఈ కేటగిరీలో శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి ప్రచురించిన 'కంటి వైద్యంలో కృత్రిమ మేధ ప్రయోజనాలు, నూతన పోకడల'పై వచ్చిన కథనానికి జాతీయస్థాయిలో ద్వితీయ అవార్డు పొందింది. ఈ అవార్డును రాయపూర్‌లో శుక్రవారం రాత్రి నిర్వహించిన కార్యక్రమంలో ఛత్తీస్‌గఢ్ ఉప ముఖ్యమంత్రి విజయశర్మ చేతులమీదుగా శంకర్ ఫౌండేషన్ డీజీఎం కె.బంగార్రాజు అందుకున్నారు.

డిక్కీలో ఉంచిన రూ.2.3 లక్షలతో స్కూటర్ మాయం

- బాధితుడి ఫిర్యాదుతో నిందితుడిని పట్టుకున్న పోలీసులు



వివరాలు వెల్లడిస్తున్న ఏడీసీపీ వెంకటరావు

మహారాణిపేట, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ అధికారులు రికార్డులు తనిఖీ చేస్తుండగా డిక్కీలో ఉంచిన డబ్బుతో స్కూటర్‌ను మాయం చేసిన నిందితుడిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసు కమిషనర్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఏడీసీపీ ఎ.వెంకటరావు వివరాలు వెల్లడించారు. మద్దిలపాలేనికి చెందిన గుడ్ల ఆంజనేయరెడ్డి బిల్డర్‌గా తన పనుల నిమిత్తం గత నెల 22న టర్నర్ చౌల్ట్రీ వద్ద రిజిస్టర్ ఆఫీస్‌కు వెళ్లారు. అక్కడ లావాదేవీల అనంతరం తన స్కూటర్ డిక్కీలో రూ.2.30 లక్షలు దాచి బయటకు వచ్చారు. ఈ క్రమంలో సెయింట్ ఆంథోనీ పాఠశాల వైపు వస్తుండగా అక్కడ ట్రాఫిక్ పోలీసు అధికారులు తనిఖీలు నిర్వహిస్తూ ఆంజనేయరెడ్డి స్కూటర్‌ను ఆపారు. ఆయన స్కూటర్ ఆపి రికార్డులు తీసుకొని తనిఖీ అధికారుల వద్దకు వెళ్లారు. రికార్డుల తనిఖీ అనంతరం తన స్కూటర్ వద్దకు వెళ్లగా వాహనం కనిపించలేదు. డిక్కీలో ఉన్న డబ్బుతో వాహనం మాయమైందని పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన మహారాణిపేట పోలీసులు సీసీ కెమెరా ఫుటేజీల ద్వారా నిందితుడిని గుర్తించారు. అక్కయ్యపాలేనికి చెందిన పుప్పల సతీష్‌ను అదుపులోకి తీసుకుని విచారించారు. అతడు నేరం అంగీకరించడంతో రూ.2.30 లక్షల డబ్బుతో పాటు స్కూటరును స్వాధీనం చేసుకున్నారు.

జీవీఎంసీలో స్టాండింగ్ కౌన్సిల్ నియామకానికి ప్రకటన

- న్యాయవాదుల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

వెంకోజీపాలెం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ తరఫున స్టాండింగ్ కౌన్సిల్ నియామకానికి న్యాయవాదుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు జీవీఎంసీ కమిషనర్ డాక్టర్ పి.సంపత్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 8 మంది న్యాయవాదుల నియామకం నిమిత్తం నోటిఫికేషన్ స్థానిక బార్ కౌన్సిల్‌లో ప్రకటించడమైనదన్నారు. ఓపెన్ కేటగిరి (ఓసీ-జనరల్)-4, వెనుకబడిన తరగతి గ్రూపు(ఏ)-1, ఎకనామికల్ వీకర్ సెక్షన్స్ -1, షెడ్యూల్ తెగలు (ఎస్‌టీ)-1, వెనుకబడిన తరగతుల గ్రూపు (బి)-1 చెందిన న్యాయవాదులు దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. న్యాయవాదులు బార్ కౌన్సిల్స్ లో కనీసం 10 సంవత్సరాల మెంబర్‌గా రిజిస్ట్రేషన్ అయి ఉండాలన్నారు. దరఖాస్తులు జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో సమర్పించాలన్నారు. గడువు తేదీ 2025, జనవరి 6గా పేర్కొన్నారు.



వాజంగి నుంచి బల్లగరువు గ్రామానికి బురదను దాటుకుంటూ వెళుతున్న ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్



అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలం పినకోట పంచాయతీ బల్లగరువులో సంకల్పం పోస్టర్ ఆవిష్కరించిన అనంతరం ప్రసంగిస్తున్న పవన్‌కల్యాణ్. చిత్రంలో ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి, అధికారులు

ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పర్యటన



వాజంగి వద్ద గిరిజనులతో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం



నగరంలో పవన్‌కల్యాణ్‌ను కలిసిన ఎమ్మెల్యేలు వంశీకృష్ణ శ్రీనివాస్, పంచకర్ల రమేష్‌బాబు, తదితరులు

మైనారిటీలకు టీడీపీ అండ

- మరో పదేళ్లు చంద్రబాబు అధికారంలో ఉండాలి
- రాష్ట్ర మైనారిటీ వ్యవహారాల సలహాదారు షరీఫ్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎండీ షరీఫ్, చిత్రంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ తదితరులు

మహారాణిపేట, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): టీడీపీ ఎప్పుడూ మైనారిటీలకు అండగా ఉంటుందని, 42 ఏళ్లుగా లౌకికవాదంతో నడిచే పార్టీ అని రాష్ట్ర మైనారిటీ వ్యవహారాల సలహాదారు, శాసనమండలి మాజీ చైర్మన్ ఎండీ షరీఫ్ అన్నారు, శనివారం టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2024లో కూటమి 164 సీట్లు సాధించడం వెనుక ముస్లింల కృషి ఎంతో ఉందన్నారు. గుంటూరు, మదనపల్లిలో కూడా విజయం కైవసం చేసుకున్నామని పేర్కొన్నారు. వైసీపీ పాలనలో ముస్లింలకు ఎలాంటి సాయం అందలేదన్నారు. టీడీపీకి అండగా ఉన్న మైనారిటీలకు ప్రభుత్వం మంచి పదవులు అప్పగించే అవకాశం ఉందని, వీరికి ప్రత్యేకంగా బడ్జెట్ కేటాయించటం తొలి విజయమన్నారు. ముస్లిం విద్యాలయాలు, మసీదులు, హజ్ యాత్రలకు రాయితీలు ఇచ్చేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. 4 శాతం రిజర్వేషన్లు కూటమి ప్రభుత్వం కొనసాగిస్తూ, ముస్లింలకు న్యాయం చేస్తుందని తెలిపారు. గత ప్రభుత్వం చేసిన అప్పులు కారణంగా పథకాల అమలు ఆలస్యమవుతున్నాయని చెప్పారు. ప్రజాస్వామ్యాన్ని, ప్రజల నిర్ణయాన్ని గౌరవించని నాయకుడు జగన్‌మోహనరెడ్డి అని వ్యాఖ్యానించారు. మరో పదేళ్లు చంద్రబాబు అధికారంలో ఉండాలని ఆకాంక్షించారు. ఈ సమావేశంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహ్మద్ నజీర్, పొలమరశెట్టి శ్రీనివాస్, మహ్మద్ గౌస్, పలువురు మైనారిటీ నాయకులు పాల్గొన్నారు.

జీవీఎంసీ బడ్జెట్‌పై స్థాయీ సంఘం సభ్యులతో సమావేశం



సమావేశంలో పాల్గొన్న అధికారులు

వెంకోజీపాలెం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 2025-26 బడ్జెట్‌పై స్థాయీ సంఘం సభ్యులతో శనివారం సమావేశం నిర్వహించినట్టు మేయర్, సంఘం చైర్‌పర్సన్ హరి వెంకటకుమారి తెలిపారు. సభ్యులు బడ్జెట్‌లో పొందుపరిచిన ప్రతి అంశాన్ని అధికారులు వివరించారు. అభివృద్ధి పనులకు బడ్జెట్‌లో ఎక్కువ నిధులు కేటాయించాలని, అందుకు తగిన విధంగా బడ్జెట్‌ను సవరించాలని స్థాయీ సంఘం సభ్యులు అధికారులను కోరారు. ముఖ్యంగా నియోజకవర్గం అభివృద్ధి కోసం ప్రత్యేకంగా నిధులు జీవీఎంసీకి వస్తాయని, అలాగే జన్మభూమి-2లో భాగంలో నగరంలో ప్రతిపాదించే వివిధ అభివృద్ధి పనులకు బడ్జెట్‌లో నిధులు కేటాయించాలన్నారు. గత ప్రభుత్వంలో ఎస్సీ ఉప ప్రణాళిక నిధులు రాలేదని, ఇకపై ఆయా నిధులకు కూడా బడ్జెట్‌లో కేటాయించాలని కోరారు. ఈ సమావేశంలో స్థాయీ సంఘం సభ్యులతో పాటు జీవీఎంసీ అదనపు కమిషనర్ ఎస్ఎస్ వర్మ, ప్రధాన ఇంజనీరు శివప్రసాద్, ఎగ్జామి

విలువిద్య పోటీలకు ఏయూ జట్టు



ఏయూ ఆర్చరీ జట్టు

విశాఖపట్నం స్పోర్ట్సు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): అఖిల భారత అంతర్ విశ్వవిద్యాలయాల విలువిద్య (ఆర్చరీ) చాంపియన్‌షిప్ టోర్నీలో పాల్గొనే ఆంధ్ర విశ్వవిద్యాలయం జట్టును శనివారం ప్రకటించారు. భువనేశ్వర్‌లోని కిట్ యూనివర్సిటీలో జరిగే ఈ టోర్నీలో ఇండియన్ రౌండ్ పురుషుల విభాగంలో దేశయ్య, ఎస్.యశ్వంత్‌నాయుడు, విజయ్‌కుమార్, వై.తరుణ్, ఎస్.రేవంత్, ఎస్.కార్తిక్, ఎస్.సమిద్‌కుమార్, టి.గణేష్ ఎంపిక కాగా, ఎస్.ఆనందబాబ స్టాండ్ బై ఉన్నాడు. మహిళల ఇండియన్ రౌండ్‌లో జి.శిరీష, పి.రమ్యశ్రీ...రికర్వ్ రౌండ్‌లో జాహ్నవి లక్ష్మి, వి.తరుణ్, ఎటి.ప్రశాంత్‌రెడ్డి...కాంపౌండ్ రౌండ్‌లో ఆర్.మోహన్ శ్రీ పూజిత ప్రాతినిధ్యం వహించనున్నారు. ఈ జట్టుకు పి.కిషోర్ కుమార్ కోచ్ కమ్ మేనేజర్‌గా వ్యవహరిస్తారు. ఈ సందర్భంగా శనివారం ఏయూ స్పోర్ట్సు బోర్డు కార్యదర్శి ప్రొఫెసర్ ఎన్.విజయ్‌మోహన్, ఏయూ వ్యాయామ విద్య క్రీడాశాస్త్రం విభాగాధిపతి డాక్టర్ ఎ.పల్లవి తదితరులు జట్టు సభ్యులను అభినందించారు.

షార్ట్ సర్క్యూట్‌తో వ్యర్థాల గోదాము దగ్ధం

- భారీగా పొగలు, మంటలు
- ఎనిమిది ఫైర్ ఇంజన్లతో మంటల అదుపు



దగ్ధమైన గోదామును పరిశీలిస్తున్న అగ్నిమాపక బృందం, పోలీసులు

జగదాంబ కూడలి, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): వన్‌టౌన్ పాత మున్సిపల్ స్టేడియం వద్ద వ్యర్థాల గోదాము శుక్రవారం అర్ధరాత్రి దగ్ధమైంది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు వ్యాపించినట్లు పోలీసులు నిర్ధారించారు. ఎనిమిది ఫైరు ఇంజన్ల సాయంతో మంటలను అదుపు చేయాల్సి వచ్చింది. భారీగా కురుస్తున్న వర్షంలోనూ మంటలు చెలరేగడం పరిసర ప్రాంతాల వారిని ఆందోళనకు గురిచేసింది. గోదాముల నిర్వాహకులు ఈ ఘటన తో బెంబేలెత్తిపోయారు. మంటలను అదుపు చేసేందుకు అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు తెల్లవార్లూ శ్రమించారు. ఈ ప్రమాద ఘటనలో రూ.3 లక్షల ఆస్తినష్టం జరిగినట్లు అంచనా. ఈ ప్రమాదానికి సంబంధించి వన్‌టౌన్ సీఐ దేముడుబాబు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రేటర్ 35వ వార్డు పరిధిలోని పాత మున్సిపల్ స్టేడియంలోని వ్యర్థాల గోదాములో నిల్వ చేసిన ఆయిల్ ట్యాంకర్ల పరికరాలు, ఇంజన్లు, ప్లాస్టిక్ పరికరాలకు విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు వ్యాపించాయి. దట్టమైన పొగలతో మంటల తీవ్రత పెరిగిపోవడంతో అదుపుచేసేందుకు తెల్లవార్లూ ఫైరు ఇంజన్లు, సిబ్బంది సాయం తీసుకోవాల్సి వచ్చిందన్నారు. పోలీస్ ఉన్నతాధికారులు, పోర్టు యాజమాన్యం, స్టీల్ ప్లాంట్ యాజమాన్యం సహకారంతో పెద్ద ప్రమాదం తప్పిందన్నారు.